# ఒంగోలులో అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవు

**- అధికారుల నిర్లక్ష్యంతో కోట్లలో పన్నుల బకాయి**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలో అక్రమ నిర్మాణాలు విస్తరిస్తుండగా, నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. సాధారణ ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు, పన్నుల పేరుతో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ, పెద్ద భవనాల నిర్మాణంలో మాత్రం నియంత్రణ కనిపించడం లేదు. అనుమతులు లేకుండా అంతస్తులపై అంతస్తులు కట్టినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగమూరు కూడలి సమీపంలో మూడు అంతస్తులకు అనుమతి తీసుకుని నాలుగు అంతస్తుల భవనం నిర్మించిన ఘటన చర్చనీయాంశమైంది. ఈ భవనానికి సంబంధించి నగరపాలక సంస్థకు సుమారు రూ.2.5 కోట్ల పన్నులు బకాయి ఉన్నప్పటికీ, వసూళ్లపై చర్యలు కనిపించడం లేదు. నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించిన అధికారులను భవన యజమాని అడ్డుకున్నట్లు సమాచారం. లేబర్ సెస్ రూపంలో కూడా భారీ మొత్తాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, అవి వసూలు కాలేదని తెలుస్తోంది. ఇక మినీ బైపాస్ పక్కన అనుమతులు లేకుండా రెండు భవనాలు నిర్మించినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదు. వాణిజ్య భవనాల నిర్మాణానికి అవసరమైన పన్నులు చెల్లించకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వయంగా వచ్చి అక్రమ నిర్మాణాల విస్తీర్ణాన్ని కొలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నగరంలోని ప్రధాన రహదారులపై అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నాయి. బీపీఎస్ కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయాలని సూచించినా స్పందన తక్కువగా ఉంది. మొత్తం 2413 అక్రమ నిర్మాణాలు గుర్తించినప్పటికీ, 600 మంది మాత్రమే దరఖాస్తు చేసినట్లు సమాచారం. దీంతో నగరపాలక సంస్థకు వందల కోట్ల ఆదాయం నష్టమవుతోంది. కోర్టు స్టే కారణంగా చర్యలు తీసుకోవడం కష్టమైందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే నగర అభివృద్ధి ప్రణాళికలు దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ కఠిన చర్యలు తీసుకుని అక్రమ కట్టడాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# గంటల వ్యవధిలో ఆలయ దొంగతనం చేధన

**- పోలీస్ అధికారులకు ధన్యవాదాలు తెలిపిన కమిటీ సభ్యులు**

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని సీతారామపురం ప్రాంతంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరిగిన దొంగతనం ఘటనను పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఉత్తరం వైపు నుండి శ్రీగిరి స్కందగిరి వెళ్లే మార్గం ప్రారంభంలో, జేసీ గృహానికి సమీపంలో ఉన్న ఈ దేవస్థానంలో శుక్రవారం రాత్రి దొంగలు హుండీని తెరిచి సుమారు రూ.1.5 లక్షల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక భక్తులు, ప్రజలు వెంటనే సంబంధిత ఒకటవ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. వేగవంతమైన దర్యాప్తు ద్వారా అనుమానితుడిని గుర్తించి, అతని వద్ద నుంచి దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆ వ్యక్తి మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, అతనికి కుటుంబ మద్దతు లేకపోవడం వల్లే ఈ చర్యకు పాల్పడ్డాడని ఒంగోలు పట్టణ సిఐ నాగరాజు తెలిపారు. అనంతరం స్వాధీనం చేసుకున్న నగదును దేవస్థానం కమిటీ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు ఇందుర్తి పవన్ విగ్నేష్, పాపిశెట్టి సురేంద్ర, గణేష్ ట్రావెల్స్ గణేష్, బేతనమూడి సాయి, శివ, కరవది రాజేష్, ధనిశెట్టి రాములు సిఐ నాగరాజు గారికి మరియు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# దేశ భద్రత, మహిళల రక్షణపై వీహెచ్పీ,బజరంగ్ దళ్ ర్యాలీ ,ధర్నా

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




దేశ భద్రత, మహిళల రక్షణ, అక్రమ ఆక్రమణలు మరియు బలవంతపు మత మార్పిడి వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) మరియు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కేశవ స్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉన్న ప్రకాశం భవనం వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా కార్యకర్తలు మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని, వివిధ ఘటనలపై దర్యాప్తు చేపట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ సంయోజక్ తిమ్మిరి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి ఈమని బలరాం, సోమ సుబ్బారావు, రామకృష్ణ, ఇనమనమెల్లూరి సీతారామయ్య, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, సాదు శ్రీనివాస గుప్తా, రామానుజ పెరుమాళ్, బోయపాటి రవి, పసుమర్తి వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

# విద్యార్థిని కాపాడిన చీమకుర్తి పోలీసులు

**చీమకుర్తి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన ఓ బీటెక్ విద్యార్థిని చీమకుర్తి పోలీసులు సమయస్ఫూర్తితో కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి మండలం , గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన దాసరి అనిల్ కుమార్ ఒంగోలు పేస్ కాలేజి నందు బి టెక్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన తమ్ముడు దాసరి భాను ప్రసాద్ కు వీడియో కాల్ చేసి నేను చీమకుర్తి లో ఉన్నాను, పురుగుమందు త్రాగి చనిపోతున్నాను అని చెప్పి కాల్ కట్ చేసాడు. దీంతో భయపడిన దాసరి భాను ప్రసాద్ ఈ విషయాన్ని చీమకుర్తి పోలీస్ స్టేషన్ కి వచ్చి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ డి. ప్రసాద్ రెండు టీం లు ఏర్పాటు చేసి దాసరి అనిల్ కుమార్ కోసం గాలించారు. అతని ఫోన్ లొకేషన్ ఆధారముగా ఎస్సై క్రిష్ణయ్య తో ఫోన్ లొకేషన్ షేర్ చేస్తూ విద్యార్థిని కనిపెట్టడానికి ప్రయత్నించారు. సదరు దాసరి అనిల్ కుమార్ ని వెస్ట్ బై పాస్ దగ్గర ఉన్న సాగర్ కాలువ కట్ట కి సుమారు 150 అడుగుల దూరంలో చెట్ల వద్ద ఉండగా అతనిని గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం చీమకుర్తి ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకుని వెళ్లి ప్రథమ చికిత్స అందించారు. డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కొరకు 108 వాహనం లో సిఐడి ప్రసాద్ ఒంగోలు కు తరలించారు. వేగంగా స్పందించి విద్యార్థిని ప్రాణాలు కాపాడిన చీమకుర్తి పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

# విద్యార్థులకు బహుమతులు

**చీమకుర్తి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



చీమకుర్తి మండలం బండ్లమూడి హరిజనవాడ మండల పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉల్లాసభరితంగా జరిగాయి. కార్యక్రమాలకు ప్రధానోపాధ్యాయులు దాసరి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ డి వి నరసింహారావు, కే శివాజీలు హాజరయ్యారు. గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన ఆరుగురు విద్యార్థులకు ఈ వేదికపై బహుమతులను అందించారు. ఎఫ్ ఎల్ బి ఎస్ లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు ఆంజనేయులు, హైమావతి, మారుతి బాబు, సిఎల్పి జయరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# కాల గమనం సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది

**- బూచేపల్లిని కలిసిన హీరో రాజా**

**చీమకుర్తి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



కాలగమనం సినిమా విడుదలై ప్రజలను ఆకట్టుకుని, హిట్ టాక్ తో నడుస్తోందని దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అభినందించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన బిరుదుల రాజా తన స్నేహితులతో కలిసి చీమకుర్తిలోని బూచేపల్లి నివాసానికి శనివారం విచ్చేశారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి లను శాలువాతో కప్పి సత్కరించారు. ఈ సినిమాను వీక్షించాలని వారిని ఆహ్వానించారు. చీమకుర్తి మండలం పాటిమీద పాలెం గ్రామానికి చెందిన బిరుదుల రాజా హీరోగా ఎదగటం తమకు సంతోషంగా ఉందని, ఈ సినిమా పెద్ద హిట్ కావాలని బూచేపల్లి ఆకాంక్షించారు. సినీ హీరో రాజా తో పాటుగా తప్పేట బాబురావు ఎం మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం:మంత్రి డోలా

**కొండేపి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందించదగ్గ విషయమని సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు శనివారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తాహశీల్దార్ శీలం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి చలివేంద్రమును శనివారం , ఆయన మంత్రి ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ రద్దీగా ఉండేటటు వంటి ప్రభుత్వం కార్యాలయాల్లో వేసవికాలం దృష్టిలో ఉంచుకుని మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు ఈ సందర్భంగా తాహశీల్ధార్ శీలం శ్రీనివాసరావునీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# మౌలిక సదుపాయల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**





ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనతో పాటు పారిశుధ్యం, తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కొండపి నియోజకవర్గం మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో నిద్రించిన కలెక్టర్ శనివారం వేకువజామునే గ్రామంలో సంబంధిత పంచాయతీ పరిధిలోని ఎస్టీ రాజుపాలెంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటిని సరఫరా చేస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సేవలతో పాటు స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని, అలాగే రోడ్డు సమస్య కూడా ఉందని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రోడ్డు సమస్యను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని వేసవిలో గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా సత్వరం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు. క్లాస్ వారీగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు ఎక్కడి నుండి వస్తున్నారు. తదితర వివరాలను విద్యా శాఖ అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి భాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్టీ రాజుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. తదుపరి గుండ్లసముద్రం పంచాయతీ పరిధిలోని మిరప చేళ్ళలో పనులు చేస్తున్న కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టడంతో పాటు పనిదినాలు కల్పించడం జరుగుతుందని, పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కూలీలకు సూచించారు. అనంతరం గుండ్లసముద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు వర్మీ కంపోస్టును తయారు చేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ప్రత్యేక అధికారి కళావతి, జడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీపీవో వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలగా చేయాలన్నదే సీఎం లక్ష్యం



**కొండపి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేసి వారి ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు గారు అనేక పథకాలు ఏర్పాటు చేసి వారికి అందిస్తున్నారని రాష్ట్ర మంత్రిబాల వీరాంజనేయ స్వామి అన్నారు నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో వీవోఏలకు 5 జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు డ్వాక్రా సంఘాల వ్యవస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అని ఆయన అన్నారు. నాడు సీఎంగా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని అన్నారు. పొదుపు సొమ్ము చెల్లింపుల్లో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకత కోసమే 5జీ టెక్నాలజీని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 25 వేల మంది వీవోఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు సులభతరంగా ఉండేందుకు ఈ నారీ, మన డబ్బులు మన లెక్కలు యాప్‌లు తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గోపీనాథ్ సిబ్బంది పాల్గొన్నారు

# ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "జల ధార జల హారతి"

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా "జల ధార జల హారతి" కార్యక్రమం శనివారం ఒంగోలు నగరంలో నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టి, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ పరిధిలోని రంగారాయుడు చెరువు వద్ద పి.వి.ఆర్ బాలుర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు మున్సిపల్ సిబ్బంది కలిసి పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. అదనంగా, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ (ఇంకుడు గుంతలు) త్రవ్వడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం మరియు నీటి వృధాను నివారించడం అత్యంత అవసరమని తెలిపారు. "ప్రతి నీటి బొట్టు విలువైనదే, దాన్ని కాపాడడం మన అందరి బాధ్యత" అనే సందేశాన్ని ప్రజల్లో బలంగా చాటారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని, నీటి సంరక్షణపై నినాదాలు చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి స్పందించి, చెరువు పరిసర ప్రాంతాల పరిశుభ్రతలో భాగస్వాములయ్యారు. అధికారులు ప్రజలకు ఇంటి స్థాయిలోనే వర్షపు నీటినిల్వ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. అలాగే, నగరంలో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను నివారించాలంటేఇప్పటి నుంచే సమగ్ర చర్యలు అవసరమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేషన్ అధికారులు పిలుపునిచ్చారు.




# ఆర్ఎంపి డాక్టర్‌ని పథకం ప్రకారం

**- భార్య,కుమార్తె హత్యచేశారు**

**- దర్శి డిఎస్‌పి వెల్లడి**




**అద్దంకి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

అద్దంకి మండలంలో ధర్మవరం గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్‌గా పనిచేస్తున్న మేడగం వెంకట కోటిరెడ్డి హత్య సంచలనం సృష్టించింది. ఈనెల 11వ తేది అర్థరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆర్ఎంపిని ముగ్గురు వ్యక్తులు వచ్చి హత్య చేశారని భార్య కట్టుకథ అల్లినట్లు, పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూశాయని దర్శి డిఎస్‌పి బాలమురళీకృష్ణ వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం అద్దంకి పట్టణ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికల వారి సమావేశంలో ఆర్ఎంపి డాక్టర్ హత్య సంఘటన విషయాలను డిఎస్‌పి వెల్లడించారు. డిఎస్‌పి కథనం మేరకు ఈనెల 11వ తేది అర్థరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆర్ఎంపి డాక్టర్‌ను భార్య మేడగం అదిలక్ష్మి, చిన్న కుమార్తె కాటం ప్రగతిలు, వెల్పుల ప్రసంగి సహకారంతో రోకలి బండతో తలపై కొట్టి హత్యచేశారని ఆయన వెల్లడించారు. ఈ హత్య జరగడానికి ఆర్ఎంపి డాక్టర్ భార్యను వేధిస్తున్నాడని, ఆమె పేర్కొన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయ్యిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణ సి.ఐ. ఎ.సుబ్బరాజు, ఎఎస్ఐ బి.వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ కె.అంకమ్మ, ఎన్.సుబ్బారావులు దర్యాప్తులో భాగంగా ఈ హత్య సంఘటనలో నేరానికి పాల్పడిన మేడగం అదిలక్ష్మి, కాటం ప్రగతి, వెల్పుల ప్రసంగిలను శుక్రవారం మధ్యాహ్నం 11.30గంటల ప్రాంతంలో సింగరకొండ లోని రెడ్డి సత్రం వద్ద వీరిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వెల్లడించారు. అయితే వీరి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్‌లు, ఒక మోటర్ సైకిల్, నేరానికి ఉపయోగించిన రోకలి బండను, కేసు తదుపరి దర్యాప్తు కొరకు స్వాధీనం పరుచుకొన్నట్లు డిఎస్‌పి వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు, నిందితుల అరెస్టు విషయంలో చురుకుగా పనిచేసిన, సి.ఐ. సుబ్బరాజు, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

# ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి ఫలితాల్లో 100 ఉత్తీర్ణత

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

సిబీఎస్‌ఈ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి ఫలితాల్లో ఒంగోలు పీఎం శ్రీ కేంద్ర విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పరీక్షలకు హాజరైన 94 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులై 100 ఫలితాన్ని సాధించడం విశేషం. గుడిపాటి హర్షిత 469 మార్కులతో (93.8) ప్రథమ స్థానం సాధించగా, శ్రీనంద కందుల నాగసాయి 454 మార్కులు (90.8), ధనుష్ హర్షిత 452 మార్కులు (90.4) సాధించారు. ఈ ఫలితాలు పాఠశాల విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయని ప్రిన్సిపాల్ మనీష్ కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల నిరంతర సాధన వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. తల్లిదండ్రుల సహకారం కూడా కీలక పాత్ర పోషించిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ విజయంతో పాఠశాల ఖ్యాతి మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హబ్దుల్ హసీఫ్ ఎం శ్రీనివాసరావు దిబ్బయ్య అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీను కుటుంబానికి న్యాయం జరగాలి

**- ఎంతవరకైనా వెళతాను అని చింతలపూడి వెల్లడి**

**- న్యాయం కోసం నామ్ రోడ్డుపై శ్రీను కుటుంబసభ్యులు ధర్నా**

**అద్దంకి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**



వైసిపి కార్యకర్త కొటికలపూడి శ్రీను చక్రాయ పాలెం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. అయితే అతని కుటుంబానికి న్యాయం చేయాలంటూ పార్టీ నేతలు, నాయకులు, కుటుంబసభ్యులు బంధువులు, 24 గంటల పాటు ప్రయత్నం చేశారు. అయితే కేసును నీరుగార్చే దిశగా తీసుకెళ్లతున్నారని, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే స్థితి లేదని, గ్రహించిన శ్రీను కుటుంబసభ్యులు బంధువులు, భవానీ సెంటర్‌లోని నామ్ హైవేపై దర్నాకు దిగారు. సమాచారం అందుకున్న అద్దంకి వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హుటాహుటిన అద్దంకికి చేరుకుని, బాధితుల తరుపున అప్పటి వరకు జరిగిన విషయాలను అటు డిఎస్‌పి, ఇటు సి.ఐ.తో తీవ్ర స్థాయిలో వాదోప వాదాలకు దిగి బాధితులను ఇబ్బందిపెడితే తాను ఎంతవరకైనా, ఈ సమస్యను తీసుకెళ్ళడంలో వెనుకాడనని చింతలపూడి పేర్కొన్నారు. శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. అప్పటికే ఆ ప్రాంతం తీవ్ర ఉద్రిక్తంగా మారిపోయింది. అప్పటికే శ్రీను, కుటుంబసభ్యులు, బంధువులుకు పోలీసుల మధ్య హైడ్రామా నడిచి, ఉద్రిక్తంగా మారింది. ప్రజలు అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఆ ప్రాంతానికి చింతలపూడి చేరుకోడంతో పార్టీ కేడర్ కూడ అధిక సంఖ్యలో చేరారు. ఎట్టకేలకు డిఎస్‌పి డాక్టర్ అశోక్ కుమార్, శ్రీను కుటుంబ సభ్యులు, బంధు వులు, అందోళన చేసిన ప్రాంతం నుండి ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరారు. అక్కడ



చర్చించారు. తీవ్ర ఉద్రిక్తల మధ్య శ్రీను మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సామాన్య వ్యక్తిగా శ్రీను కుటుంబసభ్యుడుగా అంతిమ యాత్రలో డాక్టర్ చింతలపూడి పాల్గొన్ని శ్రీను శవపేటికను స్మశానం వరకు మోసి, తన అత్మీయతను, అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం స్మశానంలో చివరిగా శ్రీను పార్థివ దేహానికి డాక్టర్ చింతలపూడి నివాళులర్పిస్తూ, శ్రీను వంటి చురుకైనా వ్యక్తిని కొల్పోవడం తనకు వ్యక్తిగతంగా తీరని లోటు అని అవేదన చెందారు. వారి కుటుంబ సభ్యుల కష్ట సుఖాలలో అండగా వుంటానని డాక్టర్ చింతలపూడి ఈ సందర్భంగా భావోద్వేగానికి గురి అయ్యారు. ఆయన వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు, శ్రీను కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడికి కార్యకర్తపై వున్న అభిమానం, నష్టపోయిన కార్యకర్త కుటుంబం పట్ల పోరాట తెగువను ప్రదర్శించిన చింతలపూడి వ్యక్తిత్వానికి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



6_6.qxd 4/19/2026 12:05 AM Page 1



## పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

### - సీడీపీవో సుధ



**బల్లికురవ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, అభివృద్ది విషయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని సీడీపీవో సుధ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సున్నా నుండి మూడు సంవత్సరాల లోపు వయసు గల చిన్నారుల మెదడు ఎదుగుదలకు తల్లిదండ్రుల ప్రత్యేక కృషి అవసరమన్నారు. చిన్నారులలో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి, గర్భిణీ స్త్రీలు, బాలింతలలో, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలపై గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జలధార, జల హారతి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మాధవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించేందుకు పొలం బాట పట్టిన తహసీల్దార్



**బల్లికురవ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వరం పరిష్కారం చూపే విధంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి, గొట్టిపాటి రవికుమార్ నిర్దిష్టమైన ఆదేశాలు వెలువరించడంతో తహసీల్దార్లు రెవెన్యూ సదస్సులను ఆరంభించారు. మండలంలోని ఎస్ఎల్‌గుడిపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సుకు హాజరైన తహసీల్దార్ రవి నాయక్ రైతుల నుండి అందిన ఫిర్యాదు మేరకు సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు పొలం బాట పట్టారు. వివాదాలు నెలకొన్న రైతులతో మాట్లాడారు. సమస్య పట్ల ఇరు వర్గాల వారు సానుకూలంగా స్పందించారు. పొలంలో ఇరు వర్గాల రైతుల సమక్షంలో అప్పటికప్పుడు రెండు సుదీర్ఘకాల సమస్యలకు పరిష్కారం చూపారు. రెవెన్యూ సదస్సులు మరో 10 ఫిర్యాదులు రైతుల నుండి స్వీకరించారు. సత్వరం పరిష్కార మార్గాలు చూపాల్సిందిగా సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాలలో వారానికి ఒక రోజు చొప్పున రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి, గ్రామస్తుల నుండి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి, సత్వర పరిష్కార మార్గాలు చూపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ భాష, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## బడి వయస్సు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించండి



**మార్టూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ నుండి 23వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరం 2026-27 గాను ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోనూ ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ అందరూ కూడా విద్యార్థులు తల్లిదండ్రులను కలిసి రానున్న విద్యా సంవత్సరానికి గాను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాల్సిందిగా సూచించి, ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న వివిధ సౌకర్యాల గురించి, ఉన్నత విద్యావంతులై, శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన టీచర్ల విద్యాబోధన కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యమని, ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనతో పాటు అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తుండగా వేలకు వేలు డబ్బులు ప్రైవేటు పాఠశాలలకు కట్టి ఆర్థిక సమస్యలు కొనితెచ్చుకోవద్దని, అప్పుల పాలు కావద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



**మార్టూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వి.సత్యసాగర్, సీఆర్పీ రామారావు బడి పిలుస్తుంది ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మార్టూరులోని విజయనగర కాలనీలో ఉన్నటువంటి అంగన్‌వాడీ సెంటర్స్ 1,2లను సందర్శించి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థినీ, విద్యార్థులను గుర్తించి సమీపంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ శాంతి, అన్నామని, ప్రధానోపాధ్యాయురాలు ఏ.మేరీ జోన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామల కాశిరెడ్డి జన్మదిన వేడుకలు



**వెలిగండ్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశంజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసికాశిరెడ్డికి టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇంద్రభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్యామల కాశిరెడ్డి రాజకీయంగా, సామాజికపరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. శ్యామల కాశిరెడ్డి ఇలాంటి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పార్టీలో నిబద్దత కలిగిన నాయకుడైనటువంటి శ్యామల కాశిరెడ్డి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల పార్టీ కుటుంబ సభ్యులందరూ అభిప్రాయపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కారంపూడి వెంకటేశ్వర్లు, మీనిగ కాశయ్య, పిన్నిక బాలకోటయ్య,ఏరువా చెంచిరెడ్డి, మహిళా నాయకురాలు పద్మ, నాగరాజు, బొప్పరాజు లక్ష్మీనారాయణ, కారంపూడి కృష్ణారావు, దేవిరెడ్డిరామిరెడ్డి,పోకల పుల్లారెడ్డి,అక్కిశ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ముక్కు శ్రీనివాసరెడ్డి, అయినకోట రంగస్వామి, రావి గురుస్వామి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ముక్కు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థిని జిల్లెల గీత భ్రమరాంబికకు అభినందనలు వెల్లువ

### - ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ - హర్షం వ్యక్తం చేసిన మండలవాసులు



**కొనకనమిట్ల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
మండలంలోని రేగడ పల్లెకు చెందిన జిల్లెల కృష్ణారెడ్డి కుమార్తె గీతభ్రమరాంబిక ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో 3వ ర్యాంకును సాధించింది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ బైపీసీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 432/440 మార్కులు సాధించింది. జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో మూడో స్థానం మార్కులు సాధించడం పట్ల రేగడపల్లి గ్రామస్తులతో పాటు, మండల వాసులు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

## వేసవి సెలవుల్లో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండండి

### - చెరువులు, కాలువలు వద్దకు చిన్నారులను వెళ్ళనీయకండి

### - పొదిలిసీఐ రాజేష్ కుమార్ సూచన




**పొదిలి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
పరీక్షలు ముగిసివేసవి సెలవులు సమీపిస్తున్నందున చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగాఉండాలని పొదిలి సీఐ రాజేష్‌కుమార్ హెచ్చరించారు. కాలువలు, కుంటలు, బావులు, చెరువుల వద్దకు ఈత రాకుండా వెళ్ళవద్దని, తప్పనిసరిగా ఈత వచ్చిన వారు పక్కన ఉంటేనే తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇటీవల పలు ప్రాంతాలలో ఈతకు వెళ్ళి మృత్యువాత పడ్డ సంఘటనలు నెలకొన్నాయని, కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి మరేదైన ప్రమాదం సంభవిస్తే వెంటనే డయల్ 112 గాని దగ్గరలోని పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్నారులకు తల్లిదండ్రులు తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్లకు ఈ విషయమై అప్రమత్తంగాఉండాలని ఆదేశించినట్లు తెలిపారు.

## జలధార, జలహారతి ద్వారా పంటల ఉత్పత్తికి చేయూత

### - సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ వెల్లడి





**సంతనూతలపాడు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతనంగా ఏర్పాటు చేసిన జలధార, జలహారతి కార్యక్రమాల ద్వారా ట్యాంకులకు పుష్కలంగా నీటి విడుదల ద్వారా రైతాంగానికి సంబంధించి పంటల సాగుకుఎంతగానో దోహదపడనున్నట్లు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు చిన్న చెరువు వద్ద శనివారం నాడు స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జల ధార, జలహారతి కార్యక్రమాలను ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. వేసవిలో చెరువు పంట కాలువలను, ట్యాంకులను శుభ్రపరిచి నీటిని పుష్కలంగా అందించేందుకు ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. మండలంలో గ్రౌండ్ లెవల్ నీరు పెంపుకు 192వర్కులను అధికారులు సిద్దం చేశారని ఇందుకు అన్ని పనులు మంజూరుకు కృషిచేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. పూడిక తీత పనులు ద్వారా గ్రౌండ్ లెవల్ వాటర్‌ను పెంపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్ బాబు, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి తన్నీరు శ్రీనివాసరావు, బాపట్లపార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు రామా శ్రీనివాసరావు, నల్లూరి కృష్ణారావు, చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, సంనతూతలపాడు గ్రామ టీడీపీఅధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, సొసైటీ డైరక్టర్ టి.నరసింహారావు, ఎన్నెస్పీ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పద్మావతి, అసిస్టెంట్ ఇంజనీర్లు షేక్ కరిముల్లా భాష, రమణారెడ్డి, బి.మధుసూదన్‌రావు, వీరాంజనేయులు, వెలుగు ఏపీఎం బాబురావు, నీటిసంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్, అరుణ కుమారి, సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ది అధికారి ఆర్.శ్రీనివాసులు, పంచాయతీ ప్రతినిధులు వై.శికామణి, బాబురావులు, టీడీపీ నాయకులు నల్లూరి గోపి, మార్పుడి అంజయ్య, మార్పుడి జనార్ధన్, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కొప్పోలు శ్రీనివాసరావు, ఎన్.ఝాన్సీ, కే.పద్మ, డి.అనిల్ కుమార్, వలేటి తిరుపతి స్వామి, ఎం.రామకృష్ణారెడ్డి, జనసేన పార్టీ నాయకులు నంద్యాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థాన అభివృద్దికి తనవంతుగా ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శనివారం నాడు మద్దిపాడు మండలం మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. ఈనెల 26వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు మద్దిపాడు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన, మల్లవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దేవస్థాన చైర్మన్ మార్నేని వీరరాఘవేంద్రరావు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి లీలా కృష్ణ నిర్వహణలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నట్లు తెలిపారు. మే 3వ తేదీ ఆదివారం నాడు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కళ్యాణ మహోత్సవంలో స్వామివారికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ చేతులమీదుగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మార్నేని వీర రాఘవేంద్రరావు తెలిపారు. భక్తులు వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. బ్రహ్మోత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ సహకారంతో ఆలయ అభివృద్దికి కోటి రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్దిపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. దేవస్థాన పునర్నిర్మాణానికి కందుకూరి వెంకట శేషయ్య ధర్మపత్ని సుబ్బరావమ్మ 5 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేసినట్లు ఆలయ చైర్మన్ వీరరాఘవేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మార్నేని వీర రాఘవేంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు గుండ్లాపల్లి శ్రీనివాసరావు, సింగరాజు అరుణ, మద్రిపూడి పద్మావతి, దొక్కా రమాదేవి, ఏల్చూరి శేషయ్య, ఇంటూరి అనంతలక్ష్మీ, మార్నేని కృష్ణారావు, గాలి వెంకట రాంబాబు, ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు(పీఎస్ఆర్), రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంతిబాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మల్లవరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గట్టినేని మల్లిఖార్జున్, కొలచనకోట గ్రామ నాయకులు మోపర్తి లాలు, టీడీపీ నాయకులు గట్టినేని అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేదింపులు తట్టుకోలేక ఇంటి ముందు భార్య పిల్లలతో ధర్నా



**పొదిలి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
భర్త వేదింపులు, అత్తమామల వీసడింపులు తట్టుకోలేక శనివారం పొదిలి పట్టణంలోని నిర్మల కాన్వెంట్ సమీపంలో ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి ముందు ధర్నాకు దిగింది. భర్త వేదింపులు భరించలేక, అత్తమామల అండతో భర్త తనను ఇంటి నుండి వెలివేశాడంటూ స్వరూపారాణి అనే వివాహిత ఆవేదన వ్యక్తం చేసింది. పొదిలి పట్టణానికి చెందిన కొదమల నాగరాజు, స్వరూపారాణిలకు సుమారు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా నాగరాజు మరొక యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని, భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే స్వరూపారాణి పుట్టింటికి వెళ్లాల్సి వచ్చింది. భర్తలో మార్పు వస్తుందని ఆశపడి, పిల్లలతో కలిసి తిరిగి ఇంటికి వచ్చిన స్వరూపారాణి చేదు అనుభవం ఎదురైంది. తన కుమారుడి తప్పులను సరిదిద్దాల్సిన మామ కొదమల రామయ్య, బాధితురాలిని అసభ్యకరమైన పదజాలంతో దూషించడమే కాకుండా, ఇంట్లోకి రానీయకుండా గేట్లు వేయించి బయటకు పంపించేశారని ఆమె వాపోయింది. కొడుకు చేస్తున్న తప్పులను మామ కూడా అండగా నిలవడమే కాకుండా, తనను నీచపు పనులకు ప్రేరేపిస్తున్నాడని స్వరూపారాణి ఆవేదనను వ్యక్తం చేసింది. భర్త, మామల తీరుపై విసిగిపోయిన బాధితురాలు, తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి ముందు కూర్చుని ధర్నా నిర్వహించింది. స్థానిక బంధువుల మద్దతుతో చివరకు ఆమె పోలీసులను ఆశ్రయించింది. ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అయిన మామ రామయ్య, తన కొడుకును బాధ్యతాయుతమైన వ్యక్తిగా పెంచకపోగా అన్యాయానికి సహకరిస్తున్నాడని ఆమె తెలిపింది. అనంతరం పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన స్వరూపారాణికి ఎస్సై ధైర్యం చెప్పి ఆమె భర్త, అత్త మామలను స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ముందు ముందు ఎలాంటి గొడవలు వేదింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గర్భిణీ బాలింత స్త్రీలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



**లింగసముద్రం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలోని పెద పవని అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఆదేశాల మేరకు పోషణ పక్వాడా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధా దేవి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ దగ్గర నుంచి 2 సంవత్సరాల పిల్లలో మెదడు వృద్ధి 80 శాతం ఉంటుందని పిల్లలకు ఈ దశ చాలా కీలకంగా ఉంటుందని, కాబట్టి ఒక తల్లి గర్భం దాల్చినప్పటి నుండి కాన్పు అయ్యే వరకు మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎక్కువ సమయం గడపటం వలన ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇస్తారని తెలియజేశారు. పిల్లలకు ఫోన్, జంక్ ఫుడ్స్, ఐస్‌క్రీమ్ లాంటి అలవాట్లకు దూరంగా ఉంచాలని ఆట పాటల ద్వారా పిల్లలకు ఇంట్లోనే ఆహ్లాదకరమైన వాతావరణం ఉంచాలని, ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతైనా ఉందని తెలిపారు. ఏ విషయాన్ని అయినా పిల్లలు ఈ వయస్సులో త్వరగా గ్రహించి నేర్చుకుంటారని ఇందుకోసం తల్లిదండ్రులు తమ సమయాన్ని కొంతసేపు పిల్లలకు కేటాయించి దేశానికి మనం మంచి పౌరులను అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ ఆయా, ఆశా వర్కర్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## లింగసముద్రంలో విషాధం.. చెక్ డ్యామ్‌లో బాలుడి మృతదేహం లభ్యం



**లింగసముద్రం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలంలో విషాధ ఘటన చోటు చేసుకుంది. జంపాలవారిపాలెం గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న గడ్డం వినయ్ బాబు గురువారం సరదాగా స్నేహితులతో కలిసి జంగండ్లపాలెం సమీపంలోని చెక్‌డ్యామ్ వద్దకు ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. వినయ్ బాబు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్సై రాంబాబు, స్నేహితులతో ఈతకు వెళ్లిన సమయంలో ప్రమాదశాత్తు మునిగి మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం చెక్‌డ్యామ్‌లో నుంచి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

## వేసవి ఎండలతో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



**సింగరాయకొండ, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**
వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ అయేషా తెలిపారు. శనివారం మండలంలోని కలికివాయ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనుల వద్ద కార్మికులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ కరపత్రాలు పంపిణీ చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ కారణంగా శరీర ఉష్ణోగ్రత అధికమవడం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, శ్వాసలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కూలీలు, వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలపాగా లేదా టోపీ ధరించడం, తెల్లని దుస్తులు వేసుకోవడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం మంచిదని సూచించారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు సుభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు బాబురావు, లక్ష్మీనారాయణ, ఆశా కార్యకర్తలు ఇందిరా, కోమలి పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడు కోటేశ్వరరావు మృతి





**పొన్నలూరు ,ఏప్రిల్ 18,ప్రభాతవార్త**
పొన్నలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నల్లపనేని కోటేశ్వరరావు శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో కొనసాగుతూ పార్టీకి విశేష సేవలు అందించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి శనివారం పొన్నలూరు విచ్చేసి కోటేశ్వరరావు భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు,మండల నాయకులు కర్నాకోటిరెడ్డి,మండవ ప్రసాద్,మండవ మురళీ, పలువురు నాయకులు సంతాపం వెలిబుచ్చారు.

## నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి




**పొన్నలూరు ,ఏప్రిల్ 18 ,ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరు పంచాయతీ పరిధిలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ ప్రత్యేకాధికారి,ఎంపిడివో డాక్టర్ పి. సుజాత అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములోని జలంజీవం అనే అంశంపై గ్రామ ప్రజలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీటి సంరక్షణ,జల వనరుల రక్షణ, గ్రేవాటర్ నిర్వహణ,ఇంకుడు గుంతలు ద్వారా నీటి పునర్వినియోగం గురించి వివరించారు. ఈ అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్, తెదేపా నాయకులు మండవ మురళి,ఏపీవో సుధాకర్,పంచాయతీ కార్యదర్శి ముప్పరాజు నారాయణ,సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడాలి



**తాళ్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాల మంచివిలువలతో విద్యనభ్యసించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలని డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య సూచించారు. మండలంలోని బొద్దికూరపాడులో మండల పరిషత్ పాఠశాల (జనరల్) వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. ఇలాంటి పాఠశాలలోనే విలువలతో కూడిన విద్యఅందుతుందని, విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. పాఠశాల అభివృద్ధి సహకరించాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.బాలకోటయ్య, ప్రధానోపాధ్యాయులు బ్రహ్మయ్య, సుబ్రమణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ జి. శివారెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయులు ఎస్. అంజిరెడ్డి, నాయకులు పి.రమణారెడ్డి, గ్రంథాలయ పాలకురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళ్లూరు ఇన్ చార్జి తహసీల్దారుగా ఫణీంద్ర



**తాళ్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
తాళ్లూరు మండల ఇన్ చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దార్ ఫణింద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న బచ్చల వెంకట రమణారావు విదేశీయ పర్యటన వెళ్లెందుకు నెల రోజులు సెలవు పెట్టారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు ఫణీంద్రను ఇన్‌చార్జిగా జిల్లా రెవిన్యూ అధికారి నియమించారు. కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు . ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ ప్రశాంత్, ఆర్ఐ సుధీర్, వీఆర్వోలు పి.చంద్రశేఖరరావు,శివారెడ్డి, రమణారెడ్డి,కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఉన్నారు.

## స్వర్ణాంధ్ర సాకారానికి కృషి చేయాలి



**తాళ్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
స్వర్ణాంధ్ర సాకారానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ పి. అజిత అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న నీటి ట్యాంక్ వద్ద మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలోటీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, క్లస్టర్ ఇన్ చార్జ్ రాచకొండ వెంకట్రావు, నాయకులు ఐవి సుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి షేక్ షహనాజ్ బేగం, వీఆర్వో నాగలక్ష్మి, స్వర్ణ కార్యాలయం సిబ్బంది అశోక్,మాధవి , తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



**తాళ్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
ప్రభుత్వ ఆదేశాల మేరకుపెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డిప్యూటీ ఈఈ ఎస్.కోటేశ్వరరావు సూచించారు. శనివారం తాళ్లూరులో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాలనను అనుసరించి పెండింగ్‌లో ఉన్న 74 గృహ నిర్మాణాలను పూర్తి త్వరగా చేయాల్సిందిగా సూచించారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ ఏఈ హనుమంతరావు, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఉన్నారు.

## పొదిలిలో జలధార జల హారతి ర్యాలీ



**పొదిలి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
పొదిలి నగర పంచాయతీ ఆధ్వర్యంలో జలధార-జలహారతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, నీటి ప్రాధాన్యతను,సంరక్షణను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని ఈ సందర్భంగామున్సిపల్ కమీషనర్ మారుతిరావు అన్నారు. నగరపంచాయతీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగి ప్రజల్లో నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించింది. అనంతరం అధికారులు బుగ్గచలం వద్ద ఉన్న వాటర్ ట్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంకు పరిసరాల పరిశుభ్రత, నీటి నాణ్యత, నీటి లభ్యత, పైపులైన్ల పనితీరును మున్సిపల్ కమీషనర్ పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు, నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. నీరు జీవనాధారం. నీటి చుక్కా వృథా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని సంరక్షించుకోవాలన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, నియోజకవర్గ తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల




**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని కంభం బస్టాండ్ సెంటర్‌లో ఆల్‌ఆలీ అమానత్ ఫౌండేషన్, డాక్టర్ మౌలాలి ఆధ్వర్యంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణానికి వస్తున్న ప్రజలదాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. దాతలు ముందుకు వచ్చి మరిన్ని చలివేంద్రాల ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. దాహంతో వచ్చిన వారికి మంచినీళ్ళు ఇవ్వడంవలన ఎంతో పుణ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టిడిపి నాయకులు తాళ్ళపల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఆడుకోవడం హేయమైన చర్య

**- డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**



**మార్కాపురం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయానికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లు అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ, మరియు మరికొన్ని పార్టీలు హీనబుద్ధిని ప్రదర్శించాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం మహిళల పట్ల తీరని ద్రోహమని పేర్కొంటూ, మహిళలకు జరుగుతున్న మేలును చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఈ విధంగా వ్యవహరించిందని ఆయన అన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అన్యాయం అని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, ఇండి కూటమి తమ స్వార్థ రాజకీయాల కోసం గత 30 ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ దేశంలోని నారీ శక్తికి తీరని అన్యాయం చేశాయన్నారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడమే కాకుండా, వారి సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపేలా ఈ కూటమి నేతలు సాంకేతిక సాకులు చెబుతూ పదేపదే ఈ చారిత్రక సంస్కరణను బలిపీఠంపైకి నెట్టారని ఏలూరి ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన క్రెడిట్‌ను మీరే తీసుకోమని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేసినా కూడా, కాంగ్రెస్ పార్టీ సహకరించకపోవడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. మహిళల హక్కులు, అవకాశాల పెంపుకు సంబంధించిన అంశాలలో రాజకీయాలను పక్కన పెట్టి సమగ్రంగా ముందుకు సాగాల్సి న అవసరం ఉందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరించిందని డా. ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

# బాధితులకు అండగా బిజెపి

**- బిజెపి రాష్ట్ర నాయకులు పివి కృష్ణారావు**



**మార్కాపురం టౌన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని పోలేరమ్మ గుడి వెనకాల కొందరు భూ కబ్జాదారులు పేదల ప్లాట్లను చదును చేసి, రాళ్ల తొలగించడాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు పివి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. బాధితులకు అండగా బిజెపి నిలుస్తుందని హామీ ఇచ్చారు. హద్దు రాళ్ళు పడవేసిన నిందితులను పోలీస్ స్టేషనుకు తీసుకురాగా పోలీస్ అధికారులతో మాట్లాడి బాధితులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. భూ కబ్జాలను బిజెపి ఎప్పటికీ సమర్థించదని, బాధితులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటాము పివి కృష్ణారావు హామీ ఇచ్చారు.

## పెద్దారవీడు నూతన ఎస్సైగా సైదుబాబు బాధ్యతల స్వీకరణ




**పెద్దారవీడు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

పెద్దారవీడు మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సైదుబాబు శనివారం సాయంత్రం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గత 20నెలలుగా మార్కాపురం పట్టణ ఎస్సైగా సమర్థవంతంగా సేవలందించిన ఆయన పనితీరును ప్రజలు ప్రశంసించారు. ఈ సందర్భంగా సైదుబాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటూ ప్రజలకు భద్రత కల్పించడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## డీహెచ్‌పిఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



**మార్కాపురం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మార్కాపురం జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు పూర్ణకంటి తిరుమలయ్య, కార్యదర్శి పందిటి మోహన్ పిలుపునిచ్చారు. శనివారం మార్కాపురంలోని పూల సుబ్బయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సిపిఐ సీనియర్ నాయకుడు అందె నాసరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల పరిస్థితి ఇప్పటికీ దయనీయంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం,రాష్ట్ర స్థాయిలో రాజకీయ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. దళితుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడంలోనే కాకుండా వాటిని అమలు చేయడంలో కూడా ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైసిపి ప్రభుత్వం దళితులను నిరాశపరిచిందని, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కులాలుమతాల పేరుతో ప్రజలను విభజించి రాజకీయ లాభాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ కాసిం, నాగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల గోడపత్రికల ఆవిష్కరణ



**కంభం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం సమగ్రశిక్ష ఉద్యోగుల గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని కోరారు. చాలీచాలని వేతనాల తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల వెతలను ఆలకించాలని హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే 15వ తేదీన విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుండి విద్యాశాఖమంత్రి నారాలోకేష్ ఇంటి వరకు కుటుంబసమేతంగా పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

## కందుకూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

**- సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**



**కందుకూరు ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రజలకు సూచించారు. జనాబా పెరుగుల కాలాను గుణంగా వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా భూగర్బ జలవనరులు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయడపడ్డారు. దీనిని అదిగమించాలంటే ప్రతిఒక్కరూ జలవనరులును, సాగునీటిని పరిరక్షించాలన్నారు. శనివారం కందుకూరులో మున్సి పల్ కమీషనర్ అనూషా ఆధ్వర్యంలో పట్టణంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కందుకూరుకు తాగునీటి వనరైన రామతీర్థం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను అధికారులుతో కలిసి ట్యాంక్ వద్ద జరుగుతున్న పారిశుధ్యపనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. చెరువులు, కుంటలు, సాగునీటికాలువలలోని గుర్రపుడెక్క, చెత్తను తొలగించాలన్నారు. వీటితో సేంద్రియ ఎరువులు, ఇతరత్రా వస్తువుల తయారీకి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ అనూష, డిఈ గణపతి, పట్టణ టిడిపి అధ్యక్షుడు మల్లేశ్వరరావు, హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబరు గడ్డం మాలకొండయ్య, తెదేపా నేతలు ఉన్నం వీరాస్వామి, పోకూరి రాంబాబు, షేక్ రఫీ, షేక్ రూబీ, అల్లం వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీను, షేక్ మున్నా, వడ్డెళ్ళ రవిచంద్ర, కల్లూరి శైలజ, పువ్వాడి

# మార్కాపురం వార్త



## స్వచ్ఛ రథాల ప్రారంభం

**- గ్రామాల్లో చెత్తకు బదులు నిత్యావసరాలు**



**మార్కాపురం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో శనివారం స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించబడింది. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మార్కాపురం మండల ఎండిఓ కార్యాలయంలో స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ఈ స్వచ్ఛ రథాలు మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో సేవలు అందించనున్నాయి. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర విజన్ 2047"కార్యక్రమంలో భాగంగా ప్రారంభించబడింది. ఈ పథకం ప్రధాన లక్ష్యం గ్రామాల్లోని పొడి చెత్తను సేకరించడం. స్వచ్ఛ రథం గ్రామాల వారీగా తిరిగి, ప్రజల నుండి పొడి చెత్తను సేకరించి, దానికి బదులుగా నిత్యావసర సరుకులను అందించనుంది. దీని ద్వారా గ్రామాల్లో శుభ్రత పెరగడంతో పాటు ప్రజల్లో పర్యావరణంపైఅవగాహన కూడా పెంపొందు తుంది. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీడీవోలు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే అందరికి ఆరోగ్యం



**బల్లికురవ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతారని డీపీవో సీహెచ్ సువార్త అన్నారు. మండలంలోని వైదన గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# జల సంరక్షణే రేపటి రక్షణ

**- శుభ్రతపై కలెక్టర్ విజయ సునీత పిలుపు**





**మార్కాపురం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రతతో పాటు జల సంరక్షణను సమిష్టిగా అమలు చేయడం ద్వారానే భవిష్యత్తులో నీటి సమస్యలను అధిగమించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని చెరువు అలుగు వద్ద నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు శుభ్రతను అలవాటు చేసుకొని ఇళ్ల ముందు, వీధుల్లో చెత్త వేయ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలధార – జల హారతి కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణపై అవగాహన పెంచి, ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేసే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా చెరువులు, ట్యాంకులను శుభ్రపరచి వర్షాకాలానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం జూన్ 14 వరకు కొనసాగుతుందని, జలవనరుల పెంపు కోసం వేగంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి కొరత రాకుండా నీటి నిల్వల ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. సమిష్టి కృషితో మార్కాపురం ప్రాంతాన్ని నీటి సమస్యల నుండి దూరంగా ఉంచుతామని చెప్పారు. అనంతరం విద్యార్థుల తో కలిసి నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డీవో ప్రభాకర్, మున్సి పల్ కమిషనర్ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ, భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాయక స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు





**రాచర్ల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజల్లో భక్తులు ఎండలను కూడా లెక్కచేయకుండా అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అవసరమైన వసతులు కల్పించారు. ఆలయ ఈవో ఎం నాగయ్య, ఇన్స్పెక్టర్ చైతన్య, చైర్మన్ నరసింహులు, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణ ఏర్పాట్లు చేశారు. హాజరైన భక్తులకు ఆలయంలోని అన్నసత్రాలలో ఆయా సత్రాల కమిటీ సభ్యులు భోజన సదుపాయం కల్పించారు.

# మండల సమాఖ్య ఆఫీస్ నందు

**- వివోఏ, వివోబిలకు జీవనోపాదుల సర్వే పై శిక్షణా కార్యక్రమం**



**త్రిపురాంతకం, ఏప్రిల్ 18,ప్రభాతావార్త**

త్రిపురాంతకం నందు గల మండల సమాఖ్య ఆఫీస్ నందు విఓఏ, విఓబీ సభ్యులకు వార్షిక ఋణ జీవనోపాదుల సర్వే 202627 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణలో సిసి జ్యోతి పాల్గొని ఈ సర్వే ఎలా చేయాలో ఏమేమి ఆక్టివిటీస్ పెట్టాలో వివరంగా తెలియజేయడం జరిగింది. ఏపియం పి.ఎడ్వర్డ్ మాట్లాడుతూ ఈ సర్వేలో ఎలాంటి తప్పిదములు జరగకుండా పారదర్శకం గా సర్వే జరగాలని, ఈ సర్వే ఏప్రిల్ 20 తేదీ నుండి 30వ తేదీలోపు పూర్తి చేయవలసిందిగా ఈనారీలు సిఆర్‌పిలకు, విఓఏలకు చెప్పడం జరిగింది. సిసి పి ఆంజనేయులు పాల్గొని ముందుగా విఓ మీటింగ్ నిర్వహించుకొని ఈ నారి సిఆర్‌పి లు, విఓఏలు, విఓ ఈసి సభ్యులకు శిక్షణ ఎలా నిర్వహించాలో అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, విఓఏ లు, ఈనారి/సిర్పిలు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంగా మారిన మార్కాపురంలో భూ కబ్జా కలకలం

**- ఎంఆర్‌ఓ పేరు, పోలీస్ కేసుతో వివాదం తీవ్రం**

**- 12 ఎకరాల్లో 240 ప్లాట్ల చదును - అనుమతులపై అనుమానాలు**

**- భూముల రేట్లు పెరగడంతో అక్రమాల భయం .. ప్రజల్లో ఆందోళన**





**మార్కాపురం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంగా మారిన తర్వాత భూముల విలువలు పెరిగిన మార్కాపురం పట్టణంలో భూ కబ్జా వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారం పోలీస్ కేసుగా మారగా, తాజాగా ఎంఆర్‌ఓ పేరుప్రస్తావన రావడం కొత్త అనుమానాలకు దారి తీసింది. కలెక్టరేట్ సమీపంలోని పోలేరమ్మ గుడి వెనుక ఉన్న సర్వే నెంబర్ 1లో సుమారు 11 నుంచి 12 ఎకరాల భూమిని లక్ష్యంగా చేసుకుని కబ్జా యత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 240 ప్లాట్లుగా విభజించిన ఈ భూమిలో రాళ్లు తొలగించి చదును చేయడం వివాదానికి కారణమైంది. సుమారు రూ20 కోట్ల విలువైన ఈ భూమిని నకిలీ పత్రాలతో ఆక్రమించేందుకు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు మేము గతంలో ఎంఆర్‌ఓకి పాస్‌బుక్ కోసం దరఖాస్తు చేసుకున్నా మని, ఎంఆర్‌ఓ స్వయంగా పరిశీలించి చెప్పిన తర్వాతే భూమిని చదును చేశామని బహిరంగంగా చెప్పడం కీలకంగా మారింది. అయితే, నిజంగా అలాంటి దరఖాస్తు చేసుకున్నారా? అధికారిక అనుమతి ఉందా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఇంత పెద్ద స్థాయిలో 12 ఎకరాల భూమిని చదును చేయడం వెనుక బలమైన మద్దతు ఉండి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. లేదంటే, ఎంఆర్‌ఓ పేరు ప్రస్తావిస్తూ ఇంత ధైర్యంగా వ్యవహరించడం ఎలా సాధ్యమవుతుందోనని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నకిలీ పత్రాలు, అనుమతుల అంశాలపై లోతుగా విచారణ కొనసాగుతోంది. మరోవైపు, తమ ప్లాట్ల భద్రతపై బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు, మార్కాపురం జిల్లా కేంద్రంగా మారడం, భూముల రేట్లు అధికంగా ఉండటం వల్ల ఇటువంటి ఘటనలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఇలాంటి సంఘటనలు చూడని స్థానికులకు ఇది కొత్తగా, కొంత భయాందోళన కలిగించే అంశంగా మారింది. ఇంకా ముందు ముందు ఇలాంటి ఘటనలు పెరుగుతాయా? అన్న చర్చ పట్టణంలోని వీధులలో జోరుగా సాగుతోంది. మొత్తానికి, పోలీస్ స్టేషన్ నుంచి ఎంఆర్‌ఓ కార్యాలయం వరకు చేరిన ఈ భూ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. అధికారుల దర్యాప్తుతో అసలు నిజాలు వెలుగులోకి వస్తాయా అన్నదానిపై స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మానసిక పాఠశాలకు మెటీరియల్ బహుకరణ



**కందుకూరు ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

కందుకూరులోని మానసిక దివ్యాంగు లకువస్తువులబహుకరణకందుకూరు, స్థానిక కందుకూరులోని స్వర్గస్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఇన్ఫినిటీ ఫిన్ క్రాప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రైవేటే సంస్థ శనివారం సుమారు రూ. 2.3లక్షల విలువైన పాఠశాల మెటీరియల్‌ను ప్రిన్సిపల్ సుబ్బారెడ్డికి అందచేశారు. క్లాస్ రూమ్ బల్లలు, కుర్చీలు, ప్రిజ్, 2 కంప్యూటర్స్‌ను ఆసంస్థ రీజినల్ సీనియస్ మరోగేజ్ మోహన్ మానసిక విద్యార్ధులకు బహుకరించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లడుతూ కందుకూరు పట్టణంలోని మానసిక దివ్యాంగులపిల్లలకు సేవలు అందిస్తున్న పాఠశాల మాజమాన్యానికి టీచర్లులకు అభినందనలన్నారు. ఈ పాఠశాలతోపాటు ఇతర సేవాసంస్థలకు మరిన్ని సేవలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నమాజ్ భాష, సురేష్, షాజీద్, విజయసారిధి పాఠశాల కరస్పాండెంట్ ఎస్. సుబ్బారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్న కండేలతో వెళ్తున్న లారీ బోల్తా .. తప్పిన ప్రమాదం



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలం మురారిపల్లి గ్రామం చెరువుకట్ట దగ్గ గంగమ్మ గుడి వద్ద లారీ బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. మురారిపల్లి గ్రామ శివారులో ఉన్న గంగమ్మ గుడి మూల మలుపు వద్ద ఓవర్ లోడ్‌తో పాటు వేగంగా వెళ్తున్న టర్బో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పెద్ద గుంతలో పడిపోయింది. మార్కాపురం నుంచి మొక్కజొన్న లోడుతో పుల్లలచెరువు మొక్కజొన్న ఫ్యాక్టరీకి వెళ్తున్న ఈ టర్బో భారీ లారీ, మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేక ప్రమాదానికి గురైంది. ప్రమాద స్థలం పక్కన 33/11 కేవీ విద్యుత్ స్తంభాలు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యాయి. అయితే అదృష్టవశాత్తు లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొనకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం కారణంగా లారీలోని మొక్కజొన్న బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదానికి అతి వేగంతో పాటు ఓవర్ లోడ్ కూడా కారణమని అధికారులు చెప్తున్నారు. మలుపులు ఉన్న ప్రాంతాల్లో వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచిస్తున్నారు.

## యర్రగొండపాలెంలో మొదలైన జనాభా గృహ గణనల అవగాహన



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం జనాభా గణన గృహ గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో సిబ్బందికి అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనాభా గణన ప్రాధాన్యత, దాని లక్ష్యాలు విధానాలపై ఏ విధంగా ముందుకు పోవాలో తమ సిబ్బందికి అధికారులు తర్ఫీదును ఇస్తున్నారు. ప్రజల దగ్గరకు జనాభా గణన సర్వేకి పోతున్నప్పుడు తమ దగ్గర ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి అధికారులు ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ జనగణన కార్యక్రమం ద్వారా ప్రజల సంఖ్య, జీవన పరిస్థితులు ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన సమాచారం సేకరించడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ డేటా ఆధారంగా భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు రూపకల్పన చేయడం సులభమవుతుందని వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా సన్సెస్ నిర్వహణలో అధికారులు పాటించాల్సి న జాగ్రత్తలు, డేటా సేకరణలో పారదర్శకత, ప్రజల నుంచి సరైన సమాచారం పొందే విధానాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే జనగణన సమయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జనగణన కార్యక్రమం ప్రభుత్వానికి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ఎంతో కీలకమని, ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గంగపాలెం చెరువులో రూ.44 లక్షలతో చిల్లకంప తొలగింపు

**- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర జలం జీవం**



**యర్రగొండపాలెం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, జలం జీవం కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం మండలం గంగపాలెం గ్రామంలో జలం జీవం అంటూ కార్యక్రమం జరిగింది. గంగపాలెం గ్రామంలోని చెరువులో పెరిగిన తుమ్మ చెట్ల చిల్ల చెట్లను తొలగించేందుకు అధికారులు ఆ పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర జలం జీవం లో భాగంగా చెరువులో ఉన్న చిల్లచెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టారు. అనంతరం చెరువులను శుభ్రంగా మార్చుకునే దిశగా జలం జీవంలో అందరూ భాగస్తులు అవ్వాలని రైతులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ మండల అభివృద్ధి అధికారి బండారు శ్రీనివాసులు, గంగపాలెం గ్రామ కార్యదర్శిలతో పాటు మండల పార్టీ అధ్యక్షులు వెంగలరెడ్డి, చేకూరి సుబ్బారావు, గంగపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు మాగులూరి వెంకటేశ్వర్లు, కేశనపల్లిమల్లిఖార్జున, నాగరాజు, చలమయ్య, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో గేదె మృతి

**- ట్రాన్స్‌ఫారంతో పొంచి ఉన్న ప్రమాదం**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వద్ద శనివారం ఓ గేదె కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని అయినముక్కల గ్రామానికి చెందిన పేద రైతు కుటుంబానికి చెందిన మూల లక్ష్మీదేవి గేదె కరెంట్ షాక్‌తో మృతిచెందింది. బాధితురాలు కథనం మేరకు గేదె విలువ రూ.70వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. జీవనాధారమైన పాడి గేదె మృతిచెందటంతో ఆ కుటుంబంలో విషాధం చోటు చేసుకుంది. ఈ ఘటనతో హాస్టల్ బాలికలు, ప్రజలు భయాందోళన గురయ్యారు. ట్రాన్స్‌ఫారంకు ఆనుకొని నీరునిల్వ ఉండగా, ఆ నీటి మడుగులో ఎర్త్ తీగ ఉండటంతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో నీరు తాగేందుకు వెళ్లిన గేదె ఆ ఎర్త్ తీగను తొక్కటంతో కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. హాస్టల్లో నుండి వచ్చే వ్యర్థమైన మురుగునీరు హాస్టల్ కాంపౌండ్ బయట వెళ్లి అక్కడి నుంచి వెళ్లే మార్గం లేక నిల్వ చేరుతాయి. ఆ నిల్వ నీటిలో గేదెలు పండుకుంటాయి. ఇక్కడ విశేషమేమంటే హాస్టల్ హాస్టల్ కాంపౌండ్ బయట కరెంట్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. ఆ ట్రాన్స్‌ఫారం ఈ నీటికి ఆనుకొని ఉండడంతో ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ ట్రాన్స్‌ఫారం పిల్లలకు చేతికందే ఎత్తులో ఉండటంతో భయాందోళనకు గురవుతున్నారు. మామూలుగా పిల్లలు సంచరించే ప్రాంతంలో ట్రాన్స్‌ఫారంలు ఏర్పాటు చేయరాదు. ఇప్పటికైనా పొంచి ఉన్న ప్రమాదాన్ని కరెంటు అధికారులు గుర్తించి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో ప్రదేశంలో ఏర్పాటు చేసి పిల్లల ప్రాణాలను రక్షించాలని కోరుతున్నారు. పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థులు, వాహనాలు ఈ మార్గమున సంచరిస్తుండడంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం కొనసాగితే మానవ ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారి నాయక్ వివరణ కోరగా తన ఒంగోలు కరెంటు అధికారుల సమావేశంలో ఉన్నానని, దోర్నాల రాగానే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు అవసరం

## - ఆర్డీవోకు వినతి



**కనిగిరి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

వేసవి కాలంలో పట్టణంలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కనిగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ రామిరెడ్డిని శనివారం కోరారు. ఈ మేరకు శనివారం కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. కనిగిరి పట్టణంలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలోని మున్సిపాలిటీ బోరు ద్వారా ఆరు వార్డులకు పైపులైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా, హైవే రోడ్డు నిర్మాణంలో ఆ బోరు దెబ్బతిందని తెలిపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే కొత్త బోరు ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్దరించాలని కోరారు. అలాగే డ్రైవర్ల కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన బోరు ధ్వంసమవడంతో అక్కడ నీటి కొరత ఏర్పడిందని, మాచవరం ఆరో వార్డు బీసీ కాలనీలో కూడా నీటి సరఫరా తక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ ప్రాంతాల్లో తక్షణమే కొత్త బోర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి స్పందిస్తూ పట్టణంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## శ్యామల కాశిరెడ్డి పుట్టిన రోజున .. పాఠశాలకు ఫ్రిడ్జ్ అందజేత



**కనిగిరి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

సమాజ సేవా భావంతో ముందుకు సాగుతున్న శ్రీ శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారంకనిగిరి వికలాంగుల పాఠశాలకు ఉప యుక్తమైన సహాయం అందింది. ఫౌండేషన్ అధినేత శ్యామల కాశిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కనిగిరి కొత్తూరు ప్రాంతంలోని మానసిక వికలాంగుల పాఠశాలకురూ. 20వేలవిలువైన ఫ్రిడ్జ్‌ను బహుకరించారు.

ఈ ఫ్రిడ్జ్‌ను ఫౌండేషన్ కన్వీనర్ ముత్తిరెడ్డి వెంకటరెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ సునీతరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కృష్టాల్లో ఉన్న వారికి తోడుగా నిలబడటం నిజమైన మానవత్వమని తెలిపారు. గత 14 ఏళ్లుగా విద్యా రంగానికి సేవలు అందిస్తున్న శ్యామల కాశిరెడ్డి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం నిస్వార్ధ సేవతో సమాజ పితానికి కృషి చేయడమేనని, భవిష్యత్తులో కూడా విద్యారంగానికి మరింత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీతరెడ్డి మాట్లాడుతూ వికలాంగుల విద్యార్ధుల కోసం ముందుకొచ్చిన ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్ధులు, ఉపాధ్యాయులు శ్యామల కాశిరెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్ధులకు, గార్లపేట రోడ్డులోని వాసవి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమ నివాసితులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ షరీఫ్, నల్లబోతుల నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

## సభ్యుల గైర్హాజరుతో మండల సమావేశం వాయిదా

**కనిగిరి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

పీసీపల్లి మండలంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఎంపీపీ జెఫన్యా అధ్యక్షతన నిర్వహించాల్సిన ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు కోరం లేకపోవడంతో సమావేశాన్ని ఎంపీడీవో కృష్ణారావు రెండు గంటల పాటు వాయిదా వేశారు. అయితే, సమావేశానికి ఎంపీపీ హాజరుకాకపోవడంతో పాటు, సాయంత్రం నాలుగు గంటల వరకు సభ్యులు ఎవరు సమావేశానికి రాకపోవడంతో వాయిదాల పరంపర కొనసాగింది. చివరికి సమావేశాన్ని ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. మండల స్థాయిలో వివిధ పనులను వాయిదా వేసుకుని సమావేశానికి వచ్చిన అధికారులు సభ్యుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారమైనా సభ్యులు హాజరవుతారా, సమావేశం కొనసాగుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాలను మర్యాదపూర్వకంగా కలిసిన చెరుకుల, ఉడుముల



**పామూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ని శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పామూరు మండలం వెంకటాపురం, దొడ్డవెంకటపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకుల వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. అనంతరం ఇరువురు దుశ్శాలువాలతో దద్దాల నారాయణ యాదవ్‌ని ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని వారికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మర్రిరాజు, శ్యామల సాంబిరెడ్డి, మల్లెల వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## జంక్‌ఫుడ్స్ వాడొద్దు



**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలో గల నాగులుప్పలపాడు మండలంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం సీహెచ్‌పట్టపుపాలెం, పోతవరం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంక్ ఫుడ్ వాడటం వలన జరిగే నష్టాలు గురించి, మన ఇంట్లో తయారు చేసే పోషకాహారం తీసుకోవడం వలన వచ్చే లాభాల గురించి పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏడబ్ల్యూడబ్ల్యూఎస్, లబ్దిదారులు పాల్గొన్నారు.

# కన్నకొడుకే కడ తేర్చేలా బెదిరింపు

- జాండ్రపేటలో కుటుంబ కలహాలు రక్తపాతం దిశగా - ఆస్తి వివాదం ముదిరి దాడులు
- వృద్దులపై దాడి, చంపేస్తాం అంటూ బెదిరింపులు - భయాందోళనలో కుటుంబం
- అన్న, కొడుకు బాబాయ్ పిన్ని నాయనమ్మ పై దాడి - పోలీసులకు ఫిర్యాదు





**చీరాల టౌన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

కన్న కొడుకే కడ తేర్చేలా ఉన్నాడు.. మమ్మల్ని కాపాడండి అంటూ జాండ్రపేటకు చెందిన ఓ వృద్ద తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. కుటుంబంలో నెలకొన్న ఆస్తి వివాదం తీవ్ర రూపం దాల్చి, అన్నదమ్ముల మధ్య గొడవలు హింసాత్మక దిశగా మారిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. స్థానికుల కథనం మేరకు.. కొంత కాలంగా అన్నదమ్ముల మధ్య ఆస్తి విషయంలో విబేధాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అన్నతో పాటు అతని కుమారుడు ఐదుగురు బయట వ్యక్తులను వెంట తీసుకుని వచ్చి, తమ సోదరుడు(బాబాయి), పిన్ని, నానమ్మలపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాడిలో ఇంటి అద్దాలు పగలగొట్టి, సీసీ కెమెరాలు బద్దలు కొట్టి కుటుంబ సభ్యులపై దాడి చేసి తీవ్ర భయభ్రాంతులకు గురి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే కేసు నమోదైన తర్వాత కూడా పరిస్థితి చల్లారకపోగా మీరు మమ్మల్ని ఏమి చేయలేరు. ఈ సారి ఖచ్చితంగా చంపేస్తా అంటూ మళ్లీ బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడిఘటనతో వృద్దులు, మహిళలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. ప్రాణభయంతో జీవిస్తున్నామని, తక్షణమే తమకు రక్షణ కల్పించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకుంటున్నారు.



# రెవెన్యూ పరిధిలో ఏ సమస్యలు ఆగకూడదు

- రైతులను ఇబ్బంది పెట్టకుండా అన్ని పనులు చేయాలి
- వీఆర్వోలకు దిశా నిర్దేశం చేసిన ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీకాంత్



**ముండ్లమూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మండలంలోని ప్రజలకు రైతులకు ఏ సమస్యలు ఉన్నా వెంటనే పనులు చేయాలని ఏ పనులు ఆపకూడదని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. శనివారం ఎమ్మార్వో కార్యాలయంలో వీఆర్వోలకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ క్యాస్ట్ ఇన్ కామ్ సర్టిఫికేట్ దగ్గర నుండి రీ సర్వే మొదలుకొని రైతులు పాస్ పుస్తకాలు కానీ ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. పరిష్కరించకపోతే అట్టి అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా రామానుజాచార్యుల గ్రామోత్సవం



**సింగరాయకొండ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో రామానుజాచార్యుల జయంతోత్స వాలు (చిన్న స్వామి తిరునాళ్లు)లో భాగంగా శనివారం ఉదయం ఢిల్లీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి, యోగానంద లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వారి మూల విరాట్‌లకు ప్రత్యేక పూలఅలంకరణలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజాచార్యులకు ప్రత్యేక అలంకరణతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం మోత కాపుల ఆధ్వర్యంలో రామానుజాచార్యుల ఉత్సవవిగ్రహాన్ని పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలుస్వీకరించారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలమండలి చైర్మన్‌సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, ఈవో కృష్ణవేణి, అర్చకులు ఉదయగిరి వెంకట శేషలక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, మోత కాపులు, భక్తులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం





**దర్శి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా శనివారం ఐదో రోజు దర్శి టౌన్‌లోని గ్యాస్ ఏజెన్సీ గూడెం వద్దకు వెళ్లి అక్కడ ఉన్నటువంటి సిబ్బందికి గోడౌన్ యాజమాన్యానికి గ్యాస్ లీకేజీ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వాళ్ళ దగ్గర ఉన్నటువంటి అగ్నిమాపక పరికరాలను ఉపయోగించి అగ్ని ప్రమాదాలను ఏ విధంగా నివారించవచ్చును వారి ద్వారా డెమో చేయించి తగు సూచనలు ఇవ్వడమైంది. తదుపరి కర్ణ బ్రదర్స్ స్పెల్లింగ్, ఎస్సార్ ఫిల్లింగ్ స్టేషన్, హెచ్‌పీ ఫిల్లింగ్ స్టేషన్, శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ కూడా అగ్ని ప్రమాదాలు నివారించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, ఆయిల్ కొట్టించుకోవడానికి వచ్చిన వారు సిగరెట్ కాల్చడం గాని, సెల్ మాట్లాడటం గానిచేయకూడదని వారికిసూచించారు. అదే విధంగా అగ్ని ప్రమాదాలు నివారించుటకు వారి దగ్గర ఉన్నటువంటి పరికరాలను పరిశీలించి వాటి గురించి వాళ్ళకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రాధికారి సీహెచ్ జాలయ్య, ఆధ్వర్యంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి



**ముండ్లమూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జలరక్ష మాస కార్యక్రమంలో భాగంగా ముండ్లమూరు మండలంలో ఎక్కడా గ్రామంలో తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుని బ్లీచింగ్ కలిపిన నీటిని సరఫరా చేయాలని, ట్యాంకులు క్లీన్ చేయాలని, బోర్‌లు రిఫేర్ చేపించాలని, మోటారు మరమ్మత్తులు చేపించాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఎంపీడీవో శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హనుమాన్‌బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# జలధార - జలహారతి కార్యక్రమం

**దర్శి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

దర్శి పురపాలక సంఘం పరిధిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు జలధార- జలహారతి కార్యక్రమం మున్సిపల్‌చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆధ్వర్యంలో కురిచేడు రోడ్డులోని నెదర్లాండ్ చెరువు వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూనీరే మన అసలైన సంపద అని, మన నదులు, చెరువులను కలుషితం చేయకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యత, ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని, ఇంకుడు గుంతలను నిర్మించి భూగర్భ జలాలను కాపాడుకుందామని, మనం తీసుకునే ఈ చిన్న అడుగు, రేపటి తరానికి మనమిచ్చే గొప్ప కానుక అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పురపాలక సిబ్బంది మెప్మా సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న దర్శి ఎస్సై మురళి





**దర్శి, ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో కళ్యాణ మండపం వద్ద ఎదురెదురుగా వస్తున్నరెండు మోటారు వెహికల్స్ ఢీకొనగా రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న ఇద్దరు వ్యక్తులు అంబులెన్స్ కోసం చూస్తుండగా ఆలస్యం అయిద్దని అప్పుడే అటుగా వస్తున్న దర్శి ఎస్సై మురళీ గమనించి వెంటనే స్థానికుల సహాయంతో తన పోలీసు వాహనంలో ఎక్కించుకుని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ ఉన్నటువంటి ప్రజలు ఎస్సై ఎం.మురళీకి అభినందనలు తెలిపారు.

## రమాదేవికి నివాళులర్పించిన తహసీల్దార్ శ్రవణ్ కుమార్



**ముండ్లమూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

సూర్య నేటి దినపత్రిక దర్శి ఆర్‌సీ ఇన్‌ఛార్జి కొర్రపాటి హరిబాబు మాతృమూర్తి కొర్రపాటి రమాదేవి ఇటీవల మృతి చెందింది. ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో శనివారం పెద్ద కర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరై నివాళులర్పించారు. వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ సీపీఎం సీపిఐ నాయకులు అద్దంకి, ముండ్లమూరు, దర్శి మండలాలకు చెందిన పత్రికా విలేకర్లు హాజరై నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# టిఆర్ఆర్ కాలేజిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



**కందుకూరు ఏప్రిల్ 18,ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ లోని 2 యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఏడుకొండలు పాల్గొన్నారు. "వాటర్ పాజిటివ్ ఆంధ్ర" అనే అంశాన్ని ప్రాతిపదికగా నీటిపరిరక్షణ మరియు జలవనరుల సంరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమం సాగింది. ఆధునిక కాలంలో నెలకొన్న అనేక కారణాల వలన భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలకోసం ప్రతి ఇంటిలోనూ, ప్రతి విద్యా సంస్థలోనూ నీటిని ఒడిసిపట్టే వ్యవస్థలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. వాటర్‌పాజిటివ్ ఆంధ్రా అనే నినాదాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఐ.క్యూ.ఏ.సికోఆర్డినేటర్ డా.పి.రాజగోపాల్‌బాబు మాట్లాడుతూ, నీటి వృధాను అరికట్టడంలో విద్యార్ధులు పాత్రను విశ్లేషించారు. కళాశాలప్రాంగణ సహజవనరులను కాపాడుకోవడం ద్వారా మనం పర్యావరణ సమతుల్యతను కాపాడగలమని వివరించారు. అనంతరం విద్యార్ధులు తమ సృజనాత్మకతను చాటుతూ నీటి పొదుపుపై రూపొందించిన వివిధ అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు జల కుంటను శుద్ధి చేసిశ్రమదానం చేశారు. దాని పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. కళాశాలలోని మియావాకివనంలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ద్వారా విద్యార్ధులకు ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ కోఆర్డినేటర్స్ కోటపాటి నరేష్‌రాజా, డా.కె.పద్మావతి, కళాశాల సీనియర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు పాల్గొన్నారు.

# పచ్చిరోట్ట ఎరువుల ద్వారా భూసారాన్ని పెంచుకోండి



**అద్దంకి, ఎఫ్రియల్ 18,ప్రభాతవార్త**

పచ్చిరోట్ట ఎరువుల సాగు ద్వారా భూసారం పెంచుకోవచ్చు అని డిఆర్‌సి వ్యవసాయ అధికారి శైలజారాణి సూచించారు. నాగులపాడు గ్రామ రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమం లో శైలజారాణి మాట్లాడారు. జీలుగ, జనుము, పిల్లిపెసర, పంటలు సాగు చేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందని అన్నారు. ఎ.ఒ. వెంకటకృష్ణ మాట్లాడుతూ పిఎండిఎస్ మినీ కిట్ల ద్వారా 15రకాల విత్తనాల కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇవి సాగుచేయడం ద్వారా భూమిలో కార్బన్‌శాతం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు వ్యవసాయ సహాయకులు చాందిని తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో కుర్చీలు అందజేత



**అద్దంకి, ఎఫ్రియల్ 18, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో, సీనియర్ రొటేరియన్ పెంట్యాల గంగాధర్ రావు సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌కి 10 ప్లాస్టిక్ కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమములో బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, చప్పిడి వీరయ్య, చిన్ని మురళీకృష్ణ, ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, గూడా లక్ష్మిరెడ్డి, జాగర్లమూడి శివకుమారి, పార్వతి, కృష్ణ హాస్టల్ వార్డెన్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## విలక్షణమైన గాత్రం కలిగిన గొప్ప నటుడు నూతన ప్రసాద్



**అద్దంకి, ఎఫ్రియల్ 18, ప్రభాతవార్త**

ఏ.పి.ఎస్.ఆర్.టి.సి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్ లో పద్మ శ్రీ షేక్ మహబూబ్ సుభాన్ స్మారక కళా వేదిక పేరుతో "ప్రతిభావంతులు సభ" జరిగింది. ఈకార్యక్రమానికి ఆర్వీ.రాఘవరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముందుగా మక్కెన వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అధ్యక్షులు రాఘవరావు మొదటిగా మహబూబ్ సుభాన్ గురించి ఉదాహరణ పూర్వకంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు నూతన ప్రసాద్ చందలూరి నారాయణరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 38 ఏళ్ల నటనానుభవంలో 475 సినిమాలకు పైగా విలక్షణమైన నటనతో సినీ రంగంలో అగ్ర నటుల సరసున నటించి ఎందరో నిర్మాతల దర్శకుల సారథ్యంలో గొప్ప గొప్ప చిత్రాల్లో అద్వితీయం నిలవడం గొప్ప ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఆయన నటించిన ముత్యాలముగ్గు, రాజాధిరాజు, కలియుగ భారతం, చలి చీమలు , పట్నం వచ్చిన ప్రతివతలు వంటి సినిమాల్లో విలక్షణంగా డైలాగ్‌లు చెబుతూ తెలుగు వారు హృదయాల్లో గొప్ప స్థానం పొందారని, డబ్బింగ్ ఆర్టిస్టుగా, టీ.వి.యాంకర్‌గా , నేరాలు, ఘోరాలు కార్యక్రమం నిర్వహణలో గొప్ప కీర్తి గడించారు. అనంతరం వి.సీతారామశాస్త్రి సత్య హరిచంద్ర కాటి సీను ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. ఈయనకు ఈ మాసపు ప్రతిభామూర్తి పురస్కారం అందచేయడం జరిగిందిం. అనంతరం పి.సి.హచ్. కోటయ్య, అన్నమనేని వెంకట్రావు, ధర్మవరపు శ్రావణ్, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, వెలసిరిరమణ, జి.అక్కయ్య చెన్నుపాటి రామాంజనేయులు, యు.దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, తాళ్లూరి నాగేశ్వరరావు, యోగేశ్వరరావు మిట్ట కామేశ్వర శర్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# చైతన్య బదిరుల పాఠశాలలో మెడికల్ క్యాంపు



**అద్దంకి , ఎఫ్రియల్ 18, ప్రభాతవార్త**

అద్దంకిలోని చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రకాశం జిల్లా రిమ్స్ హాస్పిటల్ నుండి రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం వారి సౌజన్యంతో బధిర మానసిక దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో దంత సమస్యలు, కంటి చూపు సంబంధిత సమస్యలు, సాధారణ పరీక్షలు చేసి లోపాలు గుర్తించిన విద్యార్థులను తగు సంబంధిత చికిత్స నిమిత్తం స్క్రీనింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య బృందం తరపున డాక్టర్ ప్రీతం కృష్ణ (డి. ఈ. ఐ. సి ), డాక్టర్ జయ, డాక్టర్ రాజ, విద్య, రాము పాల్గొన్నారు. వైద్య బృందం దివ్యాంగ విద్యార్థులకు, సిబ్బందికి పలు ఆరోగ్య సంబంధిత సమస్యలు పరిష్కారాలు గురించి వివరించి చెప్పటం జరిగింది. దృష్టి సంబంధిత, దంత సంబంధిత సమస్యలు గల విద్యార్థులను ఒంగోలు నందు గల రిమ్స్ హాస్పిటల్ కు రావలసినదిగా సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు సంబంధిత ఆరోగ్య లోపాలను గుర్తించుటకు వచ్చిన వైద్య బృందమునకు పాఠశాల తరపున ప్రిన్సిపల్ సురేంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. వీరితోపాటు పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్ర బాబు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటిన సెయింట్ ఆన్స్



**వేటపాలెం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విద్యార్ధుల వాలీబాల్ జట్టు, ఫేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ వారిచే నిర్వహించబడిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌లో మెన్స్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా, మహిళల కబడ్డీ పోటీలలో విన్నర్స్‌గా గెలుపొందినట్లు కళాశాలల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఫేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఒంగోలు వారిచే నిర్వహించబడిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ ఫేస్ ఫెస్టినో 2 కే 26లో మెన్స్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా, మహిళల కబడ్డీ జట్టు విన్నర్స్‌గా గెలుపొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు తెలిపారు. వాలీబాల్ పోటీలలో 16 జట్లు పాల్గొనగా, ఫైనల్స్‌లో ఫేస్ కాలేజీ జట్టుతో పోటీ పడి గెలిచినట్లు తెలిపారు. ఈ జట్టులో ఆర్.రమణ, జేవీఆర్ తేజారెడ్డి, కే.ఆంద్రూస్, జి.మైకేల్, కే.దాని, కే.సాయి కుమార్, ఎం.రేవంత్, వెంకట మణి కుమార్‌ల జట్టు పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. మహిళలలో కబడ్డీ పోటీలలో 15 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో ఫేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఒంగోలు కళాశాల జట్టుతో పోటీపడి ఫైనల్స్‌లో విన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వి.మానస, కే.అనిత, బి.ప్రవల్లికి పావని, పి.హరిణి, టి.శ్రీవిద్య, డి.రమ్య, ఎం.శ్రావణి, ఎం.సోనాలి, జి.శ్రీపూజిత, ఎం.అనిత, సి.సంజనల జట్టు పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, డాక్టర్ సి.సుబ్బారావు, డైరక్టర్ వనమా దొర నాగ సాయినాథ్, డైరక్టర్ వివిధ విభాగాధిపతులు, విద్యార్ధులు పాల్గొని వాలీబాల్ జట్టు, మహిళల కబడ్డీజట్టుకు అభినందనలు తెలియజేశారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడాలి

- తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, డిప్యూటీ ఎంపీడీవో షేక్ హజరత్ అలి, ఎంఈఓ2 కరుణకుమారి



**పామూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, డిప్యూటీ ఎంపీడీవో షేక్ హజరత్ అలీ, ఎంఈఓ జి.కరుణకుమారిలు అన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సింగిల్ ప్లాస్టిక్ కవర్ల నిషేధించాలని స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం నుండి సీఎస్‌పురం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, డిప్యూటీ ఎంపీడీవో హజరత్ అలీ, ఎంఈఓ జి.కరుణకుమారిలు మాట్లాడుతూ రీసైక్లింగ్ చేసే పద్దతే లేకపోవడంతో 100 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల అన్నింటిపైన కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న ఇయర్ బర్డ్స్, బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ పుల్ల, కవర్లు తదితర 16 రకాల వివిధ వస్తుఉల్ని నిబందన ఉల్లంఘించి ఈ వస్తువులు ఎవరు తయారు చేసిన వినియోగించిన ఐదేళ్ల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధించే అవకాశం ఉందని అన్నారు. స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి నిమిషానికి ఒక లారీ ప్లాస్టిక్‌తో నిండుతుంది. కావున ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పెరుగుతుందని రోజు రోజుకు కొండలా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని అన్నారు. కావున ప్లాస్టిక్ పాలిథిన్ కవర్లను పూర్తి స్థాయిలో నిషేధిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోమాల్యాద్రి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలో అందుబాటులో అన్ని రకాల సౌకర్యాలు

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**రాచర్ల ఏప్రిల్ 18 ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పిల్లల్ని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోని చేర్పించి ప్రయోజకులను చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాచర్లలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ బడులు వాటి వల్ల విద్యార్థులకు కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం పిల్లలకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తుందని పిల్లల కేవలం క్రమశిక్షణ కలిగి చదువుకోవడమే అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు విద్యా ఉద్యోగాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల అభివృద్ధికి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గిరిధర్ శర్మ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలి

## - డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి



**తిరుపతి,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆంధ్ర ప్రదేశ్ చైతన్య వేదిక కన్వీనర్, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అన్ని విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించాలని శనివారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు లేఖ రాశారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం, 2013లో దేశవ్యాప్తంగా సుమారు 8,500 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, 2023 నాటికి ఈ సంఖ్య 14,000కు పైగా చేరిందని తెలిపారు. కేవలం పదేళ్లలో ఈ సంఖ్య సుమారు 65 పెరగడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 నుండి 2022 మధ్యకాలంలో 3,690 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు, అందులో 1,609 మంది బాలికలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కాలంలో సుమారు 72 పెరుగుదల నమోదవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున రోజుకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి, భయం, ఆందోళన, డిప్రెషన్, ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి తగ్గుదల వంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అదనంగా పోషకాహార లోపం, తక్కువ బరువు, తలనొప్పులు, కంటి సమస్యలు, నిద్రలేమి వంటి శారీరక సమస్యలు కూడా అధికంగా కనిపిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం మాత్రమే కాకుండా సమగ్ర వ్యక్తులుగా ఎదగడం అవసరమని, ఈ దిశగా విద్యా సంస్థల్లో సైకాలజిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కాబట్టి, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సైకాలజిస్టులను నియమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఇండియన్ ఆర్మీ సైనికుల ప్యారా జంపింగ్ శిక్షణలో అపశ్రుతి!

- ప్యారాచూట్‌లతో నేలపై దిగే సమయంలో నలుగురు సైనికులకు గాయాలు
- ఆర్మీ హెలికాప్టర్‌లో హుటాహుటిన బెంగళూరులోని ఆర్మీ ఆసుపత్రికి తరలింపు
- కర్ణాటక రాష్ట్రం కారేకల్-వీరాపూర్ మధ్యలో కొనసాగిన ఆర్మీ సైనికుల శిక్షణ

**ఉరవకొండ, ఏప్రిల్ 18 ప్రభాతవార్త** ఇండియన్ ఆర్మీ సైనికులకు ఇచ్చే ప్యారా జంపింగ్ శిక్షణలో అపశ్రుతి చోటు చేసుకుంది. రాష్ట్ర సరిహద్దు విడపనకల్లు మండలం డోనేకల్లు సమీపంలో కర్నాటక రాష్ట్రంలోగల పరమదేవర హల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కారేకల్-వీరాపూర్ గ్రామాల మధ్య విశాలమైన మైదానంలో ప్రతి ఏడాది తరహాలోనే శనివారం కూడా సైనికుల శిక్షణ ప్రారంభమైంది. ఈక్రమంలో ఆర్మీ విమానంలో దాదాపు 2వేల అడుగుల పైకివెళ్లి అక్కడి నుండి పారాచూట్‌ల సాయంతో నేలపైకి దిగే శిక్షణ కొనసాగుతున్న క్రమంలో వివిధ సాంకేతిక సమస్యలు, గాలివేగం నియంత్రణలేని కారణంగా నలుగురు సైనికులు వందల అడుగుల ఎత్తుపైనుంచి వేగంగా నేలపైకి పడటంతో వారి కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడున్న శిక్షణ అధికారులు వెంటనే ఉన్నతా ధికారులకు సమాచారం అందించి ఆర్మీ హెలికాప్టర్‌ను రప్పించి గాయపడిన వారిని హుటాహుటిన బెంగళూరులోని ఆర్మీ బేస్ క్యాంపులోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం. అనుకోకుండా జరిగిన ఘటనతో ఆర్మీ శిక్షణ శిబిరంలో అలజడి చెలరేగగా మరో రెండు రోజులు జరుగాల్సిన శిక్షణ రద్దు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.



ప్యారా రైడింగ్ జంపింగ్ శిక్షణలో భాగంగా 2వేల అడుగుల ఎత్తులోంచి పారాచూట్‌ల సాయంతో కిందకు దూకుతున్న సైనికుల దృశ్యం

# చిలకలదోణ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 11కు చేరిన మృతుల సంఖ్య

**మంత్రాలయం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం చిలకలదోణ వద్ద ఈనెల 16వ తేదీన బొలెరో వాహనం, సిమెంటర్ లారీ ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం పాఠకులకు విధితమే. ఈ ప్రమాదంలో గాయపడిన కొందరు క్షతగాత్రులు కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం చికిత్సల నుంచి కోలుకోలేక ఆర్.శుభ అలియాస్ సుబ్బమ్మ(32) అనే మహిళ మృతిచెందారు. మృతురాలిది కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా శెట్టిగేర్ గ్రామం. అలాగే ప్రమాదంలో గాయపడిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మ(60) అనే మహిళ కూడా చికిత్సల నుంచి కోలుకోలేక మృతిచెందినట్లు వైద్యులు శనివారం తెలిపారు. సదరు మహిళది కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా కన్నెతనహళ్లి గ్రామం. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 11కు చేరింది. ఆసుపత్రిలో చికిత్సల నుంచి కోలుకోలేక మృతిచెందడంతో వారి బంధువుల రోదనలు మిన్నంటాయి.

# కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

## మాజీ మంత్రి అంబటి రాంబాబు

**గుంటూరు ఏప్రిల్ 18 ప్రభాత వార్త ప్రతినిధి :** వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు శనివారం ఉదయం నుండి గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షకు దిగారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలని, తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 31 వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గుంటూరులోని అంబటి నివాసం, కార్యాలయాన్ని టీడీపీ శ్రేణులు ముట్టడించాయి. ఆ తర్వాత అంబటిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు వారాల తర్వాత ఫిబ్రవరి 18న రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు.ఈ క్రమంలో తనను కస్టడీలో హింసించిన పోలీసులు సస్పెండ్ చేయాలని.. తన ఇల్లు, ఆఫీస్ పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టరేట్ వద్ద అంబటి రాంబాబు నిరాహార దీక్షకు దిగారు.ఈ నిరాహార దీక్షను సాయంత్రం 6 గంటల వరకు కొనసాగించారు.ఈ క్రమంలో మాజీ హోంమంత్రి సుచరిత చేతుల మీదగా నిమ్మరసం ఇవ్వగా అంబటి దీక్షను విరమించారు. ఈ సందర్భంగా సుచరిత మీడియాతో మాట్లాడుతూ అంబటి ఇంటిపై దాడి హేయమని, 7 గంటల పాటు దాడులు జరిగినా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. అంబటిని వేధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సుచరిత డిమాండ్ చేశారు. దాడి చేసిన టీడీపీ గూండాలను అరెస్ట్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు విడుదల రజిని, జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, కల్పలత రెడ్డి,మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మల్లాది విష్ణు, సింహాద్రి, నియోజకవర్గ సమన్వయకర్తలు అంబటి మురళి, షేక్ నూరి ఫాతిమా, వేమారెడ్డి డైమండ్ బాబు, గజ్జల భార్గవ్ రెడ్డి, అశోక్ బాబు రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ శ్యామల, న్యాయవాది శ్రవణ్ కుమార్, రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవల్లో కొత్త శకం

- 10 నెలల్లో 6.4 లక్షల మంది ప్రాణాలను కాపాడిన భవ్య హెల్త్ కేర్ 108 సర్వీస్..
- 9,183 గుండెపోటు కేసుల్లో గోల్డెన్ అవర్‌లో స్పందించి ప్రాణదానం

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలను ప్రతి కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వ భాగస్వామిగా భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నడుస్తున్న 108 అంబులెన్స్ సర్వీస్ గత 10 నెలల్లో అసాధారణ పనితీరు కనబరిచింది. జూన్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో మొత్తం 6,39,809 అత్యవసర కేసులకు తక్షణం స్పందించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజలకు అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న భవ్య హెల్త్ సర్వీస్, గత 10 నెలల్లో అత్యంత సమర్థవంతంగా సేవలందించి వేలాది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించింది. అత్యాధునిక సాంకేతికత, అంకితభావంతో కూడిన సిబ్బందితో మారుమూల ప్రాంతాల్లో కూడా ఖిగోల్డెన్ అవర్‌ఖిలో వైద్య సహాయం అందిస్తూ రాష్ట్ర ఆరోగ్య రంగంలో నమ్మకమైన భాగస్వామిగా నిలిచింది.రాష్ట్రవ్యాప్తంగా అందిన కాల్స్ లో ప్రధానంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటంలో భవ్య హెల్త్ కేర్ బృందం కీలకంగా వ్యవహరించింది. ప్రమాద బాధితుల రక్షణ 92,372 రోడ్డు ప్రమాద కేసులు, 40,450 ఇతర ప్రమాద కసుల్లో తక్షణ వైద్యం అందించారు. 87,320 మంది గర్భిణీ స్త్రీలకు మరియు 11,614 మంది నవజాత శిశువులకు సురక్షితమైన రవాణా, అత్యవసర చికిత్స అందించారు. ముఖ్యంగా గత మూడు నెలల్లోనే 9,183 మంది గుండెపోటు బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రులకు చేర్చి ప్రాణాలు నిలబెట్టారు.. భవ్య హెల్త్ కేర్ తన సేవల నాణ్యతను పెంచేందుకు పలు కీలక మార్పులు చేపట్టింది. ఫ్లీట్ అప్‌గ్రేడేషన్: పాత వాహనాల స్థానంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన 190 కొత్త అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మొత్తం 731 వాహనాలు నిరంతరం అందుబాటులో ఉన్నాయి.అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ ప్రతి అంబులెన్స్‌లో వెంటిలేటర్లు, డెఫిబ్రిలేటర్లు ఆక్సిజన్ సపోర్ట్ వంటి సౌకర్యాలతో పాటు శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ (నిలీగి) అందుబాటులో ఉంటారు. 24/7 కంట్రోల్ రూమ్: అత్యాధునిక జీపీఎస్ (బిశిళీ) టెక్నాలజీ ద్వారా అంబులెన్స్‌లను ట్రాక్ చేస్తూ, కాల్ అందిన వెంటనే తక్కువ రెస్పాన్స్ టైమ్‌లో బాధితుల వద్దకు చేరుకునేలా వ్యవస్థను రూపొందించారు.

# లక్ష్యాలకు మించిన శనగపంటను కొనుగోలు చేస్తాం

## - మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఏప్రిల్ 18,ప్రభాతవార్తప్రతినిధి:** లక్ష్యాలకు మించి శనగపంటను కొనుగోలు చేస్తామని ఏపీ వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్ననాయుడు తెలిపారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి అచ్చెన్న రాష్ట్రంలో శనగల సాగు, ఉత్పత్తి పెరిగిన విషయాన్ని వివరించారు. అదే విధంగా శనగల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. పీఎస్ఎస్ స్కీమ్ కింద అదనంగా 15 వేల టన్నుల శనగల కొనుగోలుకు కేంద్రం తక్షణమే అనుమతి ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 7.13 లక్షల టన్నుల శనగల ఉత్పత్తి జరిగినట్లు వివరించారు. ఇప్పటివరకు 94,500 టన్నుల శనగల కొనుగోళ్లు పూర్తయినట్లు వెల్లడించారు. కొనుగోలు లక్ష్యాన్ని 1,78,250 టన్నులకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. మిగిలిన 68,750 టన్నులు కేంద్రం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారు. మొక్కజొన్న రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మాల్సి వస్తోందని కేంద్రానికి మంత్రి అచ్చెన్న వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్న కేంద్రాన్ని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు పెరిగిందన్నారు. అధిక దిగుబడితో మార్కెట్‌లో మొక్కజొన్న సరఫరా పెరిగిందని అచ్చెన్న తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వాడకంతో మొక్కజొన్న డిమాండ్ తగ్గిందని అచ్చెన్న పేర్కొన్నారు.

# భక్త జనసంద్రం.. వాడపల్లి క్షేత్రం

## వేసవి దృష్ట్యా మజ్జిగ, చలి వేంద్రాలు ఏర్పాటు..

## స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ, 75 లక్షలు..

**ఆత్రేయపురం, ఏప్రిల్, 18,(ప్రభాత వార్త )** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్త జనసంద్రంగా మారింది.ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బెంగళూరు, తదితర రాష్ట్రాల నుండి ఏడు వారాలు నోము ఆచరించే భక్తులు రాకతో మాడ వీదులు గోవింద నామస్మరణతో మర్మోగాయి. ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన రద్దీ.. రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. లక్షకు పైగా భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకోగా. ముప్పై వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రత్యేక దర్శనాలు తదితర ద్వార సేవల స్వామివారికి డబ్బయ్ ఐదు లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. వివిధ జిల్లాల నుండి ఆర్టీసీ అధికారులు ఆలయానికి ప్రత్యేక బస్సులను నడిపారు. ఆలయానికి ప్రతి శనివారం సుదీర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తుల వస్తున్నారు. వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మాడవీధుల్లో భక్తులు సౌకర్యార్థం రావులపాలెం నకు చెందిన శ్రీ అంజనీ గ్యాస్ (హెచ్)ఎజన్సీ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు ప్రారంభించి భక్తులకు మజ్జిగ అందజేశారు. అన్ని ప్రాంతాల్లోని భక్తులకు దాహర్తిని తీర్చేందుకు మజ్జిగ మంచినీరు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.సాయంత్రం రాజమండ్రి వాస్తవ్యులు సత్య శ్రావణి నృత్యనికేతన్ వారి ధర్మపథం కార్యక్రమంలో జరిగిన వివిధ నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

# అలిపిరి మెట్టు మార్గంలో తప్పిపోయిన బాలుడు అప్పగింత



**తిరుమల,ఏప్రిల్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం అలిపిరి మెట్లమార్గంలో వస్తూ శనివారం ఉదయం తప్పిపోయిన బాలుడ్ని అలిపిరి విజిలెన్స్ అధికారులు గుర్తించి,సురక్షితంగా కొన్నిగంటల్లోపే తల్లిదండ్రుల చెంత చేర్చారు.తమిళనాడు చంగల్ పట్టు ప్రాంతానికి చెందిన ఆదర్శ్ (12) తల్లిదండ్రులతో కలసి అలిపిరి మెట్ల మార్గంలో నడుస్తూ సుమారు 2500వ మెట్టు వద్ద తప్పిపోయాడు. ఈ విషయం టిటిడి విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలిసింది.వెంటనే స్పందించిన ఎవీఎస్ఒలు సిబ్బందిని అప్రమత్తం చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుమలలోని పిఎసి2 ప్రాంతంలో బాలుడు కనిపించినట్లు విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఆతరువాత ఆదర్శ్‌ను సురక్షితంగా లేపాక్షి సర్కిల్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకువచ్చి ఎవిఎస్ఒ వెంకట శివ కుమార్, కృష్ణయ్య సమక్షంలో అతని బంధువులకు అప్పగించారు.

# సచివాలయాల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ ఆకస్మిక తనిఖీలు



**విజయవాడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** గ్రామసచివాలయాలను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లోని సచివాలయాలను ఆయన సందర్శించి రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బంది విధులకు గైర్హాజరవటాన్ని ఆయన గుర్తించారు. సెలవుల్లో ఉన్న సిబ్బంది మాన్యువల్‌గా నమోదు చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో సెలవు నమోదు చేయకపోవటాన్ని ఎమ్మెల్యే తప్పుపట్టారు. సచివాలయాల్లో రిజిష్టర్‌లు సక్రమంగా నిర్వర్తించకపోవటం సరికాదని మందలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిష్టర్‌లు నిర్వహించని వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జనాభా నిష్పత్తి ప్రకారం సచివాలయాల్లో సిబ్బంది లేకపోవటాన్ని గమనించిన ఆయన ఈవిషయాన్ని సంబందింత మంత్రి దృష్టికి తీసుకువెళతానన్నారు. ప్రభుత్వ అధికారులు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తరచు తాను ఆకస్మిక తనిఖీలకు వస్తానని సక్రమంగా పనిచేయని వారిపై తగిన చర్యలు ఉంటాయని యార్లగడ్డ స్పష్టం చేసారు.

# ఇంద్రకీలాద్రిపై ముమ్మరంగా ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తల పరిశీలన

## - కొండచరియల పటిష్టతపై లైవ్ డెమోలో పాల్గొన్న ఇఒ



మంత్రి పార్థసారథికి దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి కొండ చరియల పటిష్టతపై అధ్యయనం చేస్తున్న బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తల బృందం శనివారం క్షేత్రస్థాయిలో కీలక పరిశీలనలు జరిపింది. సైంటిస్ట్ ప్రసన్న జైన్ నేతృత్వంలోని బృందం, ఇఒ వీకే శీనా నాయక్, ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఇంద్రకీలాద్రిలోని వివిధ ప్రాంతాలను సందర్శించింది. ఈ సందర్భంగా ఓం టర్నింగ్ సమీపంలోని కొండ చరియలను, అలాగే ఘాట్ రోడ్ మొదటి మలుపు వద్ద ఉన్న ప్రమాదకర ప్రాంతాలను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు తాము ఉపయోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరికరాల పనితీరును ఈవో గారికి వివరించారు. కొండ చరియల్లో ఉన్న మట్టి శాతం, తేమ మరియు రాళ్ల పటుత్వాన్ని ఈ పరికరాలు ఏ విధంగా లెక్కిస్తాయో లైవ్ డెమో ద్వారా చూపించి, ఆ ఫలితాలను వివరించారు. అనంతరం బృందం హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న కొండపైకి కాలినడకన ఎక్కి, ప్రతిపాదిత ఖిరెండవ ఘాట్ రోడ్‌ఖి మార్గంలో రాతి మరియు మట్టి నమూనాలను పరీక్షించింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ భక్తుల భద్రత కోణంలోనే కాకుండా, భవిష్యత్తులో ఇంద్రకీలాద్రిపై చేపట్టబోయే ప్రతి అభివృద్ధి పనికి ఒక బ్లూ ప్రింట్ లాగా ఉపయోగపడుతుందని ఈవో స్పష్టం చేశారు. ఈ సమగ్ర అధ్యయనం, కొండ భద్రతను కాపాడుతూనే ఆధ్యాత్మిక క్షేత్ర ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసేలా బృహత్తర నిర్మాణాలకు మార్గం సుగమం చేస్తుందని వివరించారు.

- భక్తుల సేవతో పాటు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం మధ్యాహ్నం ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమం శనివారం ఇఒ ఛాంబర్‌లో జరిగింది.

# వైభవంగా ప్రారంభమైన వారసత్వ ఉత్సవాలు



కొండపల్లి బొమ్మలను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా విజయవాడలో మూడురోజులపాటు జరిగే వారసత్వ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపల్లిలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కొండపల్లి బొమ్మల పండుగను ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కొండపల్లి బొమ్మల స్టాల్స్, కీలుబొమ్మలు, తోలుబొమ్మల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని 400 ఏళ్ళ చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మల వారసత్వ సంపదను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈపండుగను ప్రతి ఏటా నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చం ద్రబాబు నాయుడు మార్గదర్శకాలకు అనుగుణంగా హస్తకళలు, హస్తకళాకారుల అభివృద్ధికి సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచి కళాకారులకు చేయూతనిస్తామని హామి ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా 19వతేదీ మూడువందలమంది కళాకారులతో మెగా కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన డిజైన్‌లు రూపొందించాల్సి ఉందన్నారు. వినూత్నంగా బొమ్మల డిజైన్‌లు రూపొందించిన కళాకారుల్లో టాప్ 10మందిని ఎంపికచేసి వచ్చే ఏడాది ఇదే ఉత్సవాల్లో ఒక్కొక్కరికీ రూ.50వేలు నగదు పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కొండపల్లి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, రామ్మోహనరావు(గాంధీ), జిల్లాపర్యాటక అధికారి ఏ.శిల్ప, రీజనల్ డైరెక్టర్ వైవి.ప్రసన్న, డిఈఓ చంద్రకళ, యువజనసంక్షేమ అధికారి కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి కొరత తీరుస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

## - గన్నవరంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

**గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. గన్నవరం మండలం చిన్నఆవుటపల్లిలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలిసి శనివారం ఉదయం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలుగు, పార చేతపట్టి కాలువల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీటినిర్వహణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకీ అడుగంటి పోతున్న భూగర్భజలాలను పరిరక్షించి, 6మీటర్ల మేర భూగర్భజలాలను పెంచటమే లక్ష్యంగా 100 రోజులపాటు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వందల టియంసిల నీరు సముద్రంపాలవుతుంటే మరోవైపు సాగునీటి యద్దడితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రిజ్వారాయర్‌లలో నీటిని నిల్వ ఉంచటంతోపాటు, సాగునీటి కాలువలను శుభ్రం చేస్తున్నట్లు వివరించారు. సముద్రంలో వృధాగా పోతున్న నీటిలో కొంతవరకు రాయలసీమకు తరలించినా అక్కడ సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మొన్నటి వరకు గన్నవరం నియోజకవర్గం అంటే దోపిడీలకు, దుర్మార్గాలకు నిలయంగా ఉండేదని, ప్రస్తుతం అభివృద్దే లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. గన్నవరం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు నెలవుగా గన్నవరం మార్పు చెందుతుందన్న మంత్రి రాబోయే రోజుల్లో గన్నవరం రూపురేఖలు మారిపోతాయని జోస్యం చెప్పారు. చంద్రబాబునాయుడు కృషి వల్ల దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో మన రాష్ట్రానికి 25శాతం పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ది చేసేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని, రాయలసీమలో ఆటోమొబైల్, ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ డెటా సెంటర్ లాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పెట్టుబడిదారులను బయపెట్టి తరిమేయాలని వైసిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. జగన్‌రెడ్డి లాంటి అరాచకశక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మంత్రి రవీంద్ర పిలుపునిచ్చారు.



కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

# హజ్‌యాత్రకు గన్నవరం నుండి సౌదీకి తరలి వెళ్లిన 156 మంది యాత్రికులు

**గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** తొలిరోజు హజ్‌యాత్రకు గన్నవరం నుండి 156 మంది యాత్రీకులు శనివారం ప్రత్యేక విమానంలో సౌదీఅరేబియాకు బయలుదేరి వెళ్ళారు. రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఫరూఖ్, ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ నజీర్‌లు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి విమానాశ్రయానికి యాత్రీకులతో వెళుతున్న బస్సులను ఆకుపచ్చజెండా ఊపి ప్రారంభించారు. హజ్‌యాత్రీకుల కోసం రాష్ట్రప్రభుత్వం గన్నవరంలోని ఎస్‌యం కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసింది. ఈశిబిరం నుండి నాలుగు బస్సులో ప్రయాణీకులు విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2.15గంటలకు 73మంది పురుషులు, 83మంది స్త్రీలు కలిపి మొత్తం 156మంది హజ్‌యాత్రీకులతో ప్రత్యేక విమానం గన్నవరం విమానాశ్రయంలో టేకాఫ్ అయ్యింది. అంతకు ముందు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ హజ్‌యాత్రీకుల కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. రాష్ట్రంలోని హజ్‌యాత్రీకులు హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్ళకుండా విజయవాడ నుండి నేరుగా సౌదీకి వెళ్ళేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. యాత్రీకులకు ప్రభుత్వం నుండి ఆర్థికసాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. కొల్లు రవీంద్ర మాట్లాడతూ అమరావతిలో హజ్‌హౌస్ నిర్మిస్తామని హామి ఇచ్చారు. మైనార్టీల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని స్పష్టం చేసారు. హజ్‌యాత్రీకులకు రాష్ట్రప్రభుత్వం నుండి లక్షరూపాయల ఆర్థికసాయం అందించటం సంతోషకమన్నారు. ఈఏడాది రాష్ట్రం నుండి 1987మంది హజ్‌యాత్రకు వెళుతుండగా, గన్నరవం నుండి 333మంది వెళుతున్నట్లు తెలిపారు. హజ్‌యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గన్నవరం నుండి హజ్‌యాత్ర ప్రారంభం కావటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. రాష్ట్రఅభివృద్ధి కోసం హజ్‌యాత్రీకులు ప్రార్ధనలు చేయాలని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి తన పాలనా దక్షతతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్దివైపు పరుగులు పెట్టిస్తుండగా, పవన్‌కళ్యాణ్, లోకేష్‌లు సహకారం అందిస్తున్నారు.



హజ్‌యాత్రికులకు కిట్‌లు అందచేస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, ఫరూఖ్, విప్ యార్లగడ్డ తదితరులు

